# కొనుగోళ్లు వేగవంతం చేయండి

- తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తాం
- రైతులు అధైర్యపడొద్దు
- జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్ రావు



16లో...

నల్లగొండ వార్త

నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి

మంగళవారం 7, మే 2024 16 పేజీలు



## నరేంద్ర మోదీ నాయకత్వంలోనే

# భారత్ సమగ్రాభివృద్ధి

- సనాతన ధర్మాన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్
- సోనియా, రాహుల్, కేసిఆర్‌లు జైలుకు వెళ్లడం ఖాయం
- బూరను భారీ మెజార్టీతో గెలిపించాలి : బీజేపి జాతీయ అధ్యక్షులు జెపి.నడ్డా

**చౌటుప్పల్, మే 6 ప్రభాతవార్త :** భారత దేశం నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపి ప్రభుత్వ హాయాంలోనే అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి సాధించి ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తుందని బీజేపి జాతీయ అధ్యక్షులు జగత్ ప్రకాష్ నడ్డా అన్నారు. బీజేపి బలపర్చిన భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం చౌటుప్పల్ మున్సిపాలిటీలోని ముస్కు మధుసూదన్‌రెడ్డి ఫిజికల్ ఎడ్యూకేషన్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు.

వివరాలు 16 పేజీలో...






# ఎన్నికల వేళ...

## అందుబాటులో ప్రత్యేక మొబైల్ యాప్‌లు

- ఫిర్యాదుల పరిష్కారానికి దోహదం
- ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు

**ప్రభాతవార్త సూర్యాపేట:** రోజురోజుకు నూతన టెక్నాలజీ అందుబాటులోకి వస్తుంది. ముఖ్యతంగా గత ఏడాది నవంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికల నిర్వహణ నుండి పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు గాను ఎన్నికల సంఘం కొత్త టెక్నాలజీకి శ్రీకారం చుట్టింది. ఆధునిక టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చి ఎన్నికలను పటిష్టంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతుంది. ఈ క్రమంలో అందవొచ్చిన అవకాశాన్ని ఎన్నికల యంత్రాంగం ఉపయోగించుకొని తమ పనిని నిర్విఘ్నంగా పూర్తి చేసుకుంటున్నారు. టెక్నాలజీ వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. దీంతో ఎన్నికల నిర్వహణకు సంబంధించి పనులు తేలికగా చేసుకునే అవకాశం కలుగుతుంది. లోక్ సభ ఎన్నికల నిర్వహణ ఎంతో కష్టంతో కూడుకున్న పని. వివిధ రాజకీయ పక్షాల నుంచి, ప్రజల నుంచి ఎలాంటి విమర్శలకు అవకాశం ఇవ్వకుండా పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలంటే ఆధునిక టెక్నాలజీ, నూతన సాంకేతిక పద్ధతులను ప్రవేశపెట్టి అమలు చేయక తప్పటం లేదు. ఈ క్రమంలోనే ఎన్నికల సంఘం ప్రత్యేక మొబైల్ యాప్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది.



2లో...

# జిల్లాలో పటిష్ట పోలీసు బందోబస్తు



- రూట్ మొబైల్స్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
- గ్రామాలు పోలింగ్ కేంద్రాలపై అవగాహన ఉండాలి
- ఎస్పీ రాహుల్ హెగ్డే

16

# కొరవడిన అధికారుల పర్యవేక్షణ

- కొనుగోలు కేంద్రాల్లో మూలుగుతున్న బస్తాలు
- గొల్లుమంటున్న అన్నదాతలు

**భువనగిరి, ప్రభాతవార్త :** అధికారుల పర్యవేక్షణ కొరవడినట్లు కనిపిస్తుంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో ధాన్యం కొనుగోల్లు మందకోడిగా సాగుతున్నాయి. కొనుగోలు చేసిన బస్తాలు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే రవాణా సౌకర్యం లేక కొనుగోలు కేంద్రాలలోనే మూలుగుతున్నాయి. వాస్తవంగా ప్రభుత్వం ప్రతిగింజను కొనుగోలు చేయడానికి ఏప్రిల్ మొదటి వారంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికి నెల రోజులు గడిచిపోతున్నా 50 శాతం ధాన్యం తూకాలు జరగని వాతావరణం గ్రామాల్లో కనిపిస్తుంది. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ళ నిర్వహణలో భాగంగా పీఏసీఎస్ ఆధ్వర్యంలో 225 కేంద్రాలు, 85ఐకేపీ, ఎఫ్‌పీవోల 13 కొనుగోళ్ళ కేంద్రాల చొప్పున ప్రారంబించారు. ఇదిలా ఉండగా తూకం వేసిన బస్తాలు రోజుల తరబడి లారీల కొరతతో ఎగుమతికి నోచుకోక నిలిచిపోతున్నాయి.



2లో...

# గొర్రెల పంపిణీ ఎప్పుడో?

- పథకం అమలుపై నీలినీడలు..
- ఆందోళనలో లబ్ధిదారులు
- డీడీలు కట్టించుకున్నారు.. గొర్రెల పంపిణీ మరిచారు
- ప్రభుత్వ నుండి హామీ వచ్చేనా..?

**మిర్యాలగూడ, ప్రభాతవార్త :** గొల్ల కురుమల, యాదవుల స్వయం సమృద్ధి, ఆర్థిక స్వావలంబన కొరకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం అర్హులైన వారందరికి గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల ఆధ్వర్యంలో గొర్రెల పంపిణీకి శ్రీకారం చుట్టింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో మండలంలో 2040 రిజిస్టర్ గ్రామ గొర్రెల పెంపకందారుల సహకారం సంఘాల ఆధ్వర్యంలో రూ.50ల మూలధన వాటాతో వయోజనులైన వారందరిని సభ్యులు చేర్చుకొని పశువర్ధకశాఖ బైలాన్ ప్రకారం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధానకార్యదర్శి కార్యవర్గ సభ్యులతో కూడిన 9మందితో తాత్కాలిక ప్రాతిపదికన కమిటి ప్రతి గొర్రెలపెంపకదారుల సంఘం ఏర్పాటు చేసి వారిలో ఎ.బి కేటగిరిలుగా విభజించి కె.కేటగిరిలోని 1213మంది సభ్యులకు సభ్యుడికి రూ.1.20,00 విలువగల ఒక యూనిట్ (గొర్రెలు, ఒక పొట్టేలు), చొప్పున రాయితీతో



2లో...

# ఎన్నికల వేళ అందుబాటులో ప్రత్యేక మొబైల్ యాప్‌లు

మొదటి పేజీ తరువాయి

ఎన్నికల సమాచారం ఓటర్లకు అందుబాటులో ఉండేలా కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో సదరు టెక్నాలజీ అమలు స్పష్టంగా కనబడుతుంది. ఎన్నికల ప్రక్రియలో పౌరులను భాగస్వామ్యం చేసేందుకు గాను పలు మొబైల్ యాప్‌లను ఎన్నికల సంఘం ప్రవేశపెట్టింది. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల వివరాలను తెలుసుకోవాలన్న, ఓటర్‌కార్డులు డౌన్లోడ్ చేసుకోవాలన్న, ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు చేయాలన్నా ప్లేస్టోర్‌లో ప్రత్యేక యాప్‌లను అందుబాటులోకి తెచ్చారు. సువిధ, సివిజిల్,కేవైసీ, అబ్జర్వర్, సాక్ష్యం ఓటర్ హెల్ప్ తదితర యాప్‌లను,నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు.ఎన్నికలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సదర్ యాప్‌ల ద్వారా తెలుసుకోవచ్చు. ఎన్నికల ఖర్చు, పోలింగ్ కేంద్రాల వివరాలు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల సమాచారం, ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదులు, ఎన్నికల ప్రవర్తన నియమావళి తదితర సమాచారాన్ని తెలుసుకునేందుకు ఈ యాప్‌లు ఉపయోగపడనున్నాయి. ఈ యాప్‌లన్నీ ప్లేస్టోర్‌లో దొరకుతాయి. ఆండ్రాయిడ్ మొబైల్ యూజర్లు ఈ యాప్‌లను డౌన్లోడ్ చేసుకోవచ్చు. సువిధ యాప్ అభ్యర్థులకు అవసరమైన ఫీచర్లు అందిస్తుంది. ఎన్నికల ప్రచారానికి అవసరమైన అనుమతులు సైతం ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. పోలింగ్ ప్రక్రియ పూర్తవగానే నమోదైన పోలింగ్ శాతం తెలుసుకునేందుకు ఎన్నికల సంఘం ఓటర్ టర్న్ అవుట్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. నియోజకవర్గాల వారీగా నమోదైన పోలింగ్‌శాతం తెలుసుకునేందుకు ఎన్నికల సంఘం ఈ యాప్‌ను ప్రవేశపెట్టింది. ఎన్నికల కోడ్ దుర్వినియోగం కాకుండా ఉండేందుకు అక్రమాలకు సంబంధించి కేసులు తెలుసుకునేందుకు వీలుగా అబ్జర్వర్లకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. ఓటర్ల సంఖ్య, రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఉన్న ప్రదేశం తదితర సమాచారాన్ని పొందవచ్చు. ఎన్నికల పరిశీలకులు ముందుగా లాగిన్ క్రియేట్ చేసుకుని వారి పాస్వర్డ్‌తో సమాచారం అందించాల్సి ఉంటుంది. అదే విధంగా సివిజిల్‌తో అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చు. డబ్బు పంపకాలు, బహుమతులు అందజేత, రెచ్చగొట్టే ప్రకటనలు, మద్యం పంపిణీ, వాహనాల్లో ఓటర్లను తరలించటం, తదితర సంఘటనకు సంబంధించి ఫోటోలు ఆడియో, వీడియో క్లిప్పులు ఈ యాప్‌లో అప్లోడ్ చేయవచ్చు.ఎన్నికల ఉల్లంఘనకు సంబంధించి వివరాలు పోస్ట్ చేస్తే అధికారులు స్పందించి అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకుంటారు. నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్ ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులను పరిష్కరించేందుకు ఉపయోగపడుతుంది. ఈ యాప్ ద్వారా ఎన్నికల సంఘానికి సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు. పోలింగ్ బూత్‌లో సమస్యలు ఉత్పన్నమైన, ఈవిఎంలు మొరాయించిన, అక్రమాలు చోటు చేసుకున్న వెంటనే ఈ యాప్ ద్వారా పోస్ట్ చేయవచ్చు. నిర్ణీత సమయంలో అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుంటారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వివరాలు తెలుసుకునేందుకు కేవైసీ యాప్‌ను ఉపయోగించుకోవచ్చు. నేరచరిత్ర కలిగిన అభ్యర్థులను తెలుసుకునేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. పోలింగ్ రోజున వీల్ చైర్ కావాలనుకుంటే పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకోవాలంటే దివ్యాంగులకు ఉపయోగించే సాక్ష్యం యాప్‌లో ఎన్నో ఫీచర్లు అందుబాటులో ఉంచారు. ఈ యాప్ దృష్టిలోపం ఉన్న దివ్యాంగులకు వాయిస్ సహకారం అందిస్తుంది. ఓటర్ల జాబితాలో ఓటరు పేరు పరిశీలించేందుకు,ఓటు వేసేందుకు అర్హత ఉందా లేదా తెలుసుకునేందుకు ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ఉపయోగపడుతుంది. ఎన్నికలకు సంబంధించిన వార్తల అప్డేట్‌తో పాటు, వాటర్ స్లిప్పు, డిజిటల్ ఫోటో డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఓటర్ హైల్ప్‌లైన్ యాప్ కల్పించింది. సాంకేతిక పరిజ్ఞానము కలిగిన వారు కంప్యూటర్ ఆన్‌లైన్‌పై అవగాహన కలిగిన వారు ఈ యాప్‌లను ప్లేస్టోర్‌లో తెలుసుకోవచ్చు. నూతన యాప్‌లను ప్రవేశపెట్టడంతో ఎన్నికల అధికారులకు ఎన్నికల నిర్వహణ సులభతరం కానుంది. ఏ సంఘటనైనా క్షణంలో తెలుసుకోవచ్చు. తద్వారా సమస్యను వెంటనే పరిష్కరించుకునే అవకాశం ఉంటుంది.

## తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ జిల్లా అధ్యక్షులుగా ముదిగొండ రామదాసు నియామకం

దేవరకొండ, మే 6, (ప్రభాతవార్త):



తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా ముదిగొండ రామదాస్ నియామకం అయ్యారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు భారి అశోక్ కుమార్ హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన రామదాసు మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉన్న వెంటనే పరిష్క రించేందుకు కృషి చేస్తామని తెలిపారు. తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు భారీ అశోక్ కుమార్, తన నియామకానికి సహకరించిన తెలిపారు. అలాగే నియోజక వర్గం మండల కమిటీల నిర్మాణం చేస్తానని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తెలంగాణ స్టూడెంట్ పరిషత్ ( టిఎస్‌పి) నిరంతరం ఉద్యమిస్తుందని తెలిపారు.

# గొర్రెల పంపిణీ ఎప్పుడో?

మొదటి పేజీ తరువాయి

కూడన పైకంతో మండలస్థాయి కమిటీ లబ్ధిదారులకు ఆంధ్రా ప్రాంతంలో కొనుగోలు చేసి సదరు యూనిట్‌లను అందజేశారు. బి.కేటగిరి కింద మిగిలిపోయిన 1227 మంది సభ్యులకు (ఎ-కేటగిరి కింద వివిధ కారణాల వల్ల మిగిలిపోయిన 9మందితో కలుపుకొని) గొర్రెలపంపిణీ కోసం గత శాసనసభ ఎన్నికల సమయంలో జిల్లా పాలనాధికారి పేరున చెల్లుబాటు అయ్యే విధంగా డిడిలను చెల్లించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచిన యూనిట్ విలువ ప్రకారం రూ.1.75వేలలో ప్రభుత్వ రాయితీ రూ.1.31.250 పోను సభ్యుడి వాటా ధనం కింద రూ.43.750లను మండలంలోని అలగడప, బాదలాపురం, కాల్వపల్లి, ఉట్లపల్లి, తడకమళ్ల, యాద్గార్‌పల్లి, పచ్చారిగడ్డ గ్రామాలకు చెందిన సుమారు 400మంది ఎన్నికలకు ముందు డిడిలు చెల్లించినప్పటికీ ఇప్పటి వరకు గొర్రెలపంపిణీ జరగలేదని వాపోతున్నారు..రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గొర్రెల పంపిణీలో అక్రమాలు జరిగాయంటూ పలు ఆరోపణలపై స్పందించిన ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. దీంతో సంబంధిత లబ్ధిదారులు గొర్రెల పంపిణీపై నీలి నీడలు కమ్ముకపోవడంతో తాము కట్టిన డిడిలైనా తమకు ఇవ్వాలని, వడ్డీలకు తెచ్చి డిడిలు తీశామని, తమ డిడిలు తమకు ఇప్పించి మమ్మల్ని ఆదుకోవాలని పలువురు సభ్యులు కోరుతున్నారు. గత ప్రభుత్వ హయంలో గొర్రెల పంపిణీలో అవకతవకలు జరిగినట్లు వాటిపై సమగ్ర విచారణ జరపాలంటూ ప్రతిపాదించడంతో డిడిలు కట్టిన గొర్రెల పెంపకందారుల సంఘం సభ్యులలో ఆందోళన నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం గొర్రెల పంపిణీ చేపట్టినా..చేపట్టకపోయినా తాము కట్టిన డిడిలు తమకు ఇప్పించాలని కోరుతున్నారు. ఈ ఎన్నికల్లో అధికార పార్టీ తమకు అనుకూలంగా హామీ ఇచ్చి గొర్రెల పంపిణీ చేయాలని పలువురు కోరుతున్నారు.

### గొర్రెలు పంపిణీ చేయాలి: ఎర్రయ్యయాదవ్



రెండో విడత లబ్ధిదారులకు తక్షణమే గొర్రెలు పంపిణీ చేయాలని మిర్యాలగూడ డివిజన్ యాదవ సంఘం అధ్యక్షుడు చిమట ఎర్రయ్యయాదవ్ అన్నారు. సోమవారం మిర్యాలగూడలో స్థానికంగా ఆయన మాట్లాడుతూ సబ్సిడి గొర్రెల కోసం రూ.43,750 వాటాధనం కింద డిడిలు చెల్లించినట్లు తెలిపారు. 2023 మే నెలలో డిడిలు చెల్లించి ఏడాది కావస్తుందని, తక్షణమే గొల్ల, కుర్మ లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ చేయాలని కోరారు.

## ఆర్థిక సహాయం అందజేసిన మాజీ ఎంపిపి



చండూరు రూరల్,6మే,(ప్రభాతవార్త):

మండల పరిధిలో గల ఉడుతలపల్లి గ్రామంలో ఆదివారం కురిసిన గాలి వానకు బుషిపాక హుస్సేన్‌కు చెందిన ఆవు పిడుగుపడి మృతి చెందింది.విషయం తెలుసుకున్న మాజీ ఎంపిపి తోకల చంద్రకళ వెంకన్న సోమవారం సంఘట స్థలానికి వెళ్లి హుస్సేన్‌కు 10వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.వారివెంట బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొత్తపాటి సతీష్, ఉడతలపల్లి గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, రామగిరి నాగరాజు, కావలి శ్రీను, తదితరులు ఉన్నారు.

# కొరవడిన అధికారుల పర్యవేక్షణ

మొదటి పేజీ తరువాయి



ఫలితంగా నిప్పులకొలిమిలా మండుతున్న భానుడి ప్రతాపంతో తూకం వేసిన బస్తాల బరువు తగ్గుతుండడంతో మిల్లర్లు సదరు లారీలకు వచ్చిన ధాన్యం తూకాల్లో వ్యత్యాసం వస్తుందని, సవా లక్ష కొర్రీలు పెడుతుండడంతో అన్నదాతలు నెత్తినోరు బాధుకుంటున్నారు. కాగా .. ప్రభుత్వం యంత్రాంగం తూకాలను వేగవంతం చేయడంతో తూకం వేసిన బస్తాలను ఎప్పటికప్పుడు మిల్లులకు పంపాలని క్షేత్రస్థాయిలోని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నా ఆచరణలో మాత్రం మిల్లర్ల కొర్రీలు, రవాణా వసతి సమస్యలు అన్నదాతలను వెంటాడుతూనే ఉన్నాయి. ఈ సమస్య అధిగమించడానికి ప్రత్యేక మార్గదర్శకాలను జారీ చేయాల్సిన అధికారులు కేంద్రాల వైపు దృష్టి సారించనందునే తమ ధాన్యం సకాలంలో తూకాలు వేయడం లేదని, ఒకవేళ తూకం వేసినా ఎప్పటికప్పుడు మిల్లులోకి ఎగుమతి చేసుకోలేకపోతుండడంతో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసి ముద్ద అయ్యాయని పలువురు అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఏ కొనుగోలు కేంద్రాల్లో చూసిన 1000 నుంచి 3వేల బస్తాల వరకు తూకాలు వేసిన బస్తాలు కొనుగోలు కేంద్రాల్లో ఉన్నట్లు తెలుస్తుంది. దీనికి తోడు ఏ కొనుగోలు కేంద్రాలు చూసినా ధాన్యపు రాశులే తూకాల కోసం ఎదురుచూస్తున్న సంఘటనలు దర్శనం ఇస్తున్నాయి. ఒకవైపు నల్లటి మబ్బులు, మరోవైపు అకాల వర్షాలు తోడు అవ్వడంతో ఎప్పుడు ఏ ఉపద్రవం ముంచుకోస్తుందోనని బక్కచిక్కిన బక్కరైతులు తీవ్రభయాందోళనకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన కేంద్రాలలో ప్రైవేటు వ్యాపారులు తూకాలు వేయవద్దని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికి రవాణా వసతి, మిల్లర్ల కొర్రీలు భరించలేక కొంతమంది రైతులు అర్ధకు పావుశేరు కళ్లాల్లోనే కాటాలు పెట్టుకుని ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రథమంగా వెల్మజాల గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో మధ్య దళారీ వ్యాపారులు బాహాటంగానే కాటాలు పెట్టి ఇటు ప్రైవేటు వ్యాపారస్తులు ఇటు తూకంలో శఠగోపం పెడుతూ, ఇటు మద్దతు ధరలో కోత విధిస్తూ అన్నదాతలను నిలువునా దోచుకుపోతున్నా కనికరం చూపే నాథుడే కరువయ్యాడు. నెల రోజులు గడిచిపోతున్నా .. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేపట్టి అందుకు అవసరమైన రవాణా సౌకర్యాలను ఏర్పాటు చేయాల్సిన అధికార యంత్రాంగం, ఇటు మిల్లర్లు, అటు రవాణా సౌకర్యాల సమస్యలు ఎదురవుతున్నా ప్రత్యామ్నాయ చర్యలు కల్పించడంలో విఫలమవుతున్నారని స్థానిక వ్యవసాయ రైతాంగం దుమ్మెత్తి పోస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు కొనుగోలు కేంద్రాల్లో తూకాలు వేసిన ధాన్యం బస్తాలను ఎప్పటికప్పుడు మిల్లులకు ఎగుమతి అయ్యేలా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుని అందగా ఏ మేరకు నిలుస్తారో వేచి చూడాల్సిందే.



## మాతృ పార్టీలో చేరిన ముత్యాల భూపాల్‌రెడ్డి

చౌటుప్పల్, మే 6 ప్రభాతవార్త

చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు ముత్యాల భూపాల్‌రెడ్డి సోమవారం తిరిగి బిజెపిలో చేరారు. బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి.నడ్డా సమక్షంలో తిరగి బిజెపిలో చేరగా, ఆయనకు బిజెపి కండువా వేసి స్వాగతం పలికారు. భూపాల్‌రెడ్డి గత 1996లో బిజెపి కిసాన్‌మోర్చా ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షునిగా పనిచేశారు. చౌటుప్పల్ ప్రాంతంలో ఆర్ఎస్ఎస్‌ను బలోపేతం చేయడంలో నాడు కీలకంగా వ్యవహారించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసిఆర్ చేపట్టిన ఉద్యమాలకు ఆకర్శితులై నాటి టిఆర్ఎస్ పార్టీలో చేరారు. తెలంగాణ ఉద్యమంలో తనదైన పాత్ర పోషించి తెలంగాణ రాక ముందు టిఆర్ఎస్ మండల అధ్యక్షునిగా, రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా పనిచేశారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత



బిఆర్ఎస్ పార్టీకి దూరంటా ఉంటూ సోమవారం జెపి.నడ్డా సమక్షంలో బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రధానిగా మోడీ మూడో సారి భారీ విజయం సాధించడం కాయమన్నారు. భువనగిరి ఎంపీగా బూర నర్సయ్యగౌడ్ గెలుపు కోసం తనవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

## జానా పరామర్శ

హాలియా, ప్రభాతవార్త, మే 6:



మాజీ ఎడమ కాల్వ వైస్ చైర్మన్ మలిగిరెడ్డి లింగారెడ్డిని, మాజీ సీఎల్‌పీ నేత కుందూరు జానారెడ్డి సోమవారం హాలియాలోని అతని స్వగృహంలో పరామర్శించారు. లింగారెడ్డి అనారోగ్యంగా ఉండడంతో విషయం తెలుసుకొని అరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. వారి వెంట పీసీసీ సెక్రటరీ కర్నాటి లింగారెడ్డి, నాయకులు యడవల్లి నరేందర్‌రెడ్డి, తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కుందూరు వెంకట్‌రెడ్డి, వెంపటి శ్రీనివాస్, చింతల చంద్రారెడ్డి, కుక్కడాల అంజనేయులు, నెర్మటి వెంకట్‌రెడ్డి, రిక్కల సుధాకర్‌రెడ్డి, రావుల శ్రీనివాస్, నరేందర్ తదితరులు ఉన్నారు.

## జూనియర్ అడ్వకేట్ల సమస్యలపై నిరంతర ఉద్యమాలు

చౌటుప్పల్, మే 6 ప్రభాతవార్త



చౌటుప్పల్ బార్ అసోసియేషన్‌ను సోమవారం బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ కె.సునిల్‌గౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ బార్ అసో సియేషన్‌లో పనిచేస్తున్న అడ్వకేట్ల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ అడ్వకేట్లకు ప్రభుత్వం ఇస్తానంటున్న ఆర్థిక సహకారాన్ని సాధించేందుకు పనిచేస్తామన్నారు. ఈ కార్య క్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఊడుగు శ్రీనివాస్‌గౌడ్, కార్య దర్శి రాపోలు వేణు, సహాయ కార్యదర్శి జిల్లా రమేష్, మక్తాల్ నర్సింహా, నర్రి స్వామి, పూర వ అధ్యక్షులు ఎలమోని శ్రీనివాస్, బాల్యం వెంకటాచలపతి, ఖయ్యూం, దాచెపల్లి చంద్రబాబు తదితరులున్నారు.

## ఎస్సెస్సీలో మండల టాపర్‌కు ఘన సత్కారం

చౌటుప్పల్, మే 6 ప్రభాతవార్త



ఇటీవల విడుదల చేసిన పదో తరగతి వార్షిక ఫలితాల్లో తంగడపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన అయినాల భాను 9.7 జిపిఎ సాధించి మండల టాపర్‌గా నిలిచారు. అదే పాఠశాలకు చెందిన సిలివేరు అనుష 9.5 జిపిఎ సాధించి ఉత్తమ ప్రతిభ కనపర్చారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మండల టాపర్స్‌గా నిల్చిన భాను, అనుషలను పాఠశాల ప్రధానోపాధ్యాఉరాలు డి.భార్గవి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఊదరి పద్మలు ఘనంగా సత్కరించి అభినందించారు. కార యక్రమంలో మాజీ ఎస్ఎంసి చైర్మన్ బొడ్డు ముత్యం, ఉపాధ్యాయులు బి.శ్రీరాములు, ఎల్.నర్సింగ్‌రావు, సిహెచ్.వెంటకయ్య, డి.వెంకటేశ్వర్లు, మోటె సత్తయ్య, కె.నర్సింహా, పి.రమాదేవి, పి.మంగమ్మ, డి.యాదయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు అశోక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## బాదిత రైతు కుటుంబానికి చల్లమల్ల ఆర్థిక సహాయం అందజేత

సంస్థాన్‌నారాయణపురం, మే 6 ప్రభాతవార్త



సంస్థాన్‌నారాయణపురం మండలం గుజ్జ గ్రామంలో ఇటీవల పిడుగుపాటకు గురై చాపల వెంకటేశ్వర్లుకు చెందిన కాడెడ్లు మృతి చెందాయి. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు చల్లమల్ల కృష్ణారెడ్డి రైతు నివాసాన్ని సందర్శించి పరమారి ్శంచారు. తక్షణ అర్థిక సహాయం కింద సమకూర్చిన రూ.30 వేలను అందజేశారు. అంతే కాకుండా కాడెడ్లను సైతం కొనుగోలు చేసి అందిస్తామని ఆ రైతు కుటుంబానికి బరోసా కల్పించారు.

## పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించిన పాశం గోపాల్‌రెడ్డి

గుర్రంపోడ్, మే 6, ప్రభాతవార్త:

గుర్రంపోడ్ మండల పరిధిలో గల శాకాజిపురం గ్రామంలోని అందుగుల పెద్దమ్మ మరణించిన విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్‌రెడ్డి పార్థివ దేహానికి పూలదండ వేసి సందర్శించి నివాళులర్పించడం జరిగింది. వాళ్ళ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యాన్ని కోల్పోవద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో జైపాల్‌రెడ్డి, బోడ సురేష్, గిరి సతీష్, మాజీ ఉపసర్పంచ్ అందుగుల స్వరణ్ పాల్గొనడం జరిగింది.






## అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతి

గుర్రంపోడ్, మే 6, ప్రభాతవార్త:



గుర్రంపోడ్ మండలం మోసంగి గ్రామంలో రాత్రి సమయం 10గంటలకు నడ్డి శ్రీను తండ్రి బ్రహ్మయ్య కుమారుడు అనుమాన స్పదంగా మృతి చెందడం జరిగింది. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. నిన్న సాయంత్రం 7 గంటలకు వర్షం వస్తుండడంతో పొలం దగ్గర ఎండు మిర్చి పైన కవర్ కప్పడానికి ఇద్దరు స్నేహితులు శీలం సైదిబాబు, సల్లశంకర్‌లని తీసుకొని బావి దగ్గరకి వెళ్ళి వద్దామని తీసుకెళ్ళాడు. ఆ సమయంలో ఏంజరిగిందో కానీ శ్రీను చనిపోయిన విషయం కూడా రాత్రి స్నేహితులు ఎవరికి చెప్పలేదు. ఉదయం లేవగానే 7 గంటలకు శవమై కనపడగానే గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడం జరిగింది. సంఘటన స్థలానికి చేరుకునన పోలీసులు వాళ్ళ ఇద్దరినీ అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ గవర్నమెంట్ హాస్పిటల్‌కి తరలించడం జరిగింది. వాళ్ళ భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ శివప్రసాద్ కేసు నమోదు చేసుకొని పూర్తి వివరాల కోసం దర్యాప్తు చేస్తున్నారు.

## బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించిన వారికి రూ.50 వేల జరిమానా

సంస్థాన్‌నారాయణపురం, మే 6 ప్రభాతవార్త

సంస్థాన్‌నారాయణపురంలో ఇటీవల నాటు సారాయి కేంద్రాలపై దాడులు నిర్వహించి తయారీ దారులను తహశీల్దార్ ముందు బైండోవర్ చేశారు. కానీ వారి పద్ధతి మార్చుకోకపోవడంతో తిరిగి నాటు సారాయి తయారు చేస్తూ పట్టుబడటంతో బైండోవర్ నిబంధనల ఉల్లంఘన కింద మర్రిబావితండాకు చెందిన మెగావత్ సుజాత, పొర్లగడ్డతండాకు చెందిన అంగోతు దూద్య, ముడావత్ బుజ్జిలపై ఒక్కోక్కరి నుంచి రూ.50 వేల జరిమానా విధించి వసూల్లు చేసినట్లు రామన్నపేట ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ ఆర్.బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు.

## ఎన్నికల కోడ్ బేకాతర్

మునగాల, ప్రభాతవార్త :

ఎన్నికల కోడ్ బేకాతర్ చేస్తున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలలోకి వెళ్తే పోలీసులకు కూతవేటు దూరంలో హైవే వెంబడి బెల్ట్ షాపులు నిర్వహిస్తూ ట్రాఫిక్ జాములకు కారకులు అవుతున్నారు. దీనిపై సంబంధిత అధికారుల దృష్టికి పోయినప్పటికీ ఫలితం లేకుండా పోవడం గమనార్హం. దీంతో వారి వ్యాపారంతో పాటు ఇతరులపై దురుసు ప్రవర్తన కూడా దారితీస్తుంది. పోలీసులు మద్దతు వారిపై ఉందని విచ్చల విడిగా వ్యాపారం సాగిస్తున్నారు. ఇప్పటికైనా సదరు వ్యక్తులుపై చర్యలు తీసుకొని వ్యాపారుల తీర్మారే విధంగా చూడాలని పలువురు కోరుకుంటున్నారు.

## అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి

నడిగూడెం,మే06,ప్రభాతవార్త :

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతిచెందిన సంఘటన నడిగూడెం స్టేషన్ పరిధిలోని త్రిపురవరం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై అజయ్‌కుమార్ కథనం ప్రకారం సంఘటన పూర్వపరాలు ఇలా ఉన్నాయి .. త్రిపురవరం గ్రామానికి చెందిన కొమ్ము అలివేలమ్మ (70) సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలు చేతబడి చేస్తుందనే అనుమానంతో హుస్సేన్,మరోవ్యక్తి అనే వ్యక్తి తాడుతో మృతురాలి మెడకు ఉరి వేసి చంపారని అనుమానం వ్యక్తం చేశారు. మృతురాలి మనువడు సాయికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## చల్లబడ్డ వాతావరణం

–మునగాల్లో వర్షం జల్లు

**మునగాల, ప్రభాతవార్త :** గత కొద్దిరోజులు పెరిగిన ఉష్ణోగ్రత్తలతో అల్లడంతల్లడమైన ప్రజలకు చల్లబడ్డ వాతావరణం ఉపశమనం తీర్చుకున్నారు. మునగాల మండలం లో జిల్లాలోని అత్యధికంగా ఉష్ణోగ్రత నమోదు కావడం తెలిసింది. ఈ నేపథ్యంలో సోమవారం వాతావరణం ఒక్కసారిగా మార్పు రావడం మండలం లో వర్షం జల్లు కురవడంతో వాతావరణంలో మార్పు ఏర్పడింది. నిన్నటిదాకా ఉక్క పోత ఇబ్బందులు పడ్డ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

# ఘనంగా మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకళ్యాణం

మఠంపల్లి మే 6 ప్రభాతవార్త



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకళ్యాణంను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కళ్యాణ తంతు కార్యక్రమాన్ని వందలాదిమంది భక్తుల నడుమ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు కళ్యాణాన్ని తిలకించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, కార్యనిర్వహణ అధికారి సిరికొండ నవీన్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణచార్యులు, లక్ష్మి నర్సింహమూర్తి,ఆంజనేయాచార్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఈదురు గాలులు, వడగళ్ల వాన..

ఈదురు గాలులతో వడగండ్ల వాన

మండలంలో కొంతమేర పంట నష్టం

ఆందోళన చెందుతున్న రైతులు

నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు





**చింతలపాలెం మే 6 ప్రభాతవార్త :** మండలంలో మెరుపులు, ఉరుములతో ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వాన సోమవారం సాయ త్రం కొంత మేర భీభత్సం సృష్టించింది. దీంతో గ్రామాల్లో విద్యుత్ నిలిచి పోయింది. అక్కడక్కడ చెట్లు విరిగి పడటంతో రోడ్లపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నా ప్రజలకు ఈ వాన కొంత మేర ఉపశమనం కలిగించింది. మండలపరిధిలోని రేబల్లె గ్రామంలో రైతులు బొప్పాయి తోటలు వేశారు. భారీగా ఈదురు గాలులు వీయడంతో చేతికొచ్చిన తోటలు నేలపాలయ్యాయి. చేతికొచ్చిన పంట నేలకొరిగి పోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్క రైతుకు సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని, సంబంధిత అధికారులు నష్టపోయిన పంటలను పరిశీలించి నష్టాన్ని ఉన్నతాధికారుల దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి తమ న్యాయం చేసి నష్ట పరిహారం చెల్లించాలని రైతులు కోరారు.

# సమస్యల పరిష్కారానికై ఎమ్మెల్యేకు గోపాలమిత్రల వినతి



**కట్టంగూర్, మే 6,ప్రభాతవార్త :** రాష్ట్రంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం తెలంగాణ గోపాలమిత్ర సంఘం ఆధ్వర్యంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశానికి వినతిపత్రం అందజేశారు. ఈమేరకు నకిరేకల్‌లోని ఎమ్మెల్యే వేముల వీరేశం ఇంటికి వెళ్లి తమ సమస్యలను వివరించినట్లు గోపాల మిత్ర సంఘం రాష్ట్ర సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడు చేరుకు శ్రీనివాస్ వెల్లడించారు.ఈసందర్భంగా చెరుకు శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 1530 మంది గోపాలమిత్రులు తెలంగాణలో మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో మనుషులకు సైతం వైద్యం అందని పల్లెల్లో పాడి రైతుల పశువులకు కృత్రిమ గర్భధారణ సేవలు అందిస్తున్నామన్నారు. అత్యవసర సమయాల్లో 24/7 సేవలు అందజేస్తున్నామని,తమ సమస్య పరిష్కారానికి ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లేందుకే ఎమ్మెల్యే వీరేశాన్ని కలవడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లేందుకుకి తీర్చడం కోసం తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే వీరేశం హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్వీస్ పచార కార్యదర్శి కావటి యాదగిరి, సహాయ కార్యదర్శి దోమల ముత్తయ్య, శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎల్లంభుల శంభులింగం, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు ఆల్దాస్ లింగయ్యగౌడ్, కోశాధికారి వెంకన్ననాయక్, భువనగిరి జిల్లా ఉపాధ్యక్షులు గుండాల నర్సింహాగౌడ్, మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

# ఈదురుగాలుల భీభత్సం.. పేదల బతుకులు చిన్నాభిన్నం

చింతపల్లి,6మే,ప్రభాతవార్త:



చింతపల్లి మండలం రాయిని గూడెం గ్రామంలో ఆదివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం భీభత్సాన్ని సృష్టించింది.నివాస గృహాలు, తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.ఇండ్ల పైకప్పులు దెబ్బతినడంతో పేదవారి బతుకులు చిన్నాభిన్నం అయ్యాయి. ఇంటిలో వస్తువులు తడిచి,నిలువ నీడలేక ఉరుములు,మెరుపులు పిడుగులకు భయాందోళన చెందారు.చెట్లు ఇండ్లు కూలడంతో ప్రజలు ఆందోళన చెందారు.కరెంటు వైర్లు తెగిపడి ఎప్పుడు ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.చింతపల్లి మండలం రాయినిగూడెం గ్రామంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ ఈదురుగాలులు,ఉరుములు మెరుపులతో వర్షం పడటంతో గ్రామానికి చెందిన దూదిమెట్ల విజయ్‌కుమార్ శ్రీలక్ష్మి పౌల్ట్రీఫాం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు.ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం కారణంగా పౌల్ట్రీఫాం నేలమట్టం అయ్యింది.దీనిమీదే ఆధారపడి జీవనం సాగిస్తున్నవారికి ఉన్న ఆధారం కోల్పోవడంతో కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపించారు.వీరితోపాటు పలువురి ఇండ్ల రేకులతో ఉన్న పైకప్పులు గాలికి లేచిపోయి కుంటుంబాలకు నిలువ నీడ లేకుండా పోయింది.ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## ఈవిఎం కమిషనింగ్ ప్రక్రియ పరిశీలన

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ యస్. వెంకట్రావు



**ప్రభాతవార్త సూర్యాపేట:** లోకసభ ఎన్నికల నేపథ్యంలో ఈవిఎమ్స్ కమిషనింగ్ (బ్యాలెట్ పేపర్ అనుసంధానం) ప్రక్రియ అప్రమత్తంగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావు అధికారులను ఆదేశించారు. సోమవారం సూర్యాపేట ఏఎంసీ మార్కెట్ యార్డ్‌లో సూర్యాపేట, నియోజక వర్గానికి సంబంధించి ఈవిఎమ్స్ కమిషనింగ్, మాక్‌పోల్ విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని నియోజక వర్గాల పరిధిలో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఈవిఎమ్స్ కమిషనింగ్ ప్రక్రియ అలాగే మాక్ పోల్ అప్రమత్తంగా చేపట్టాలని సూచించారు. ఆ కార్యక్రమంలో ఆర్.డి.ఓ వేణుమాధవ్, తహశీల్దార్‌లు శ్యామ్ సుందర్ రెడ్డి, కృష్ణయ్య, మహేందర్ రెడ్డి, ఎస్ఎల్ఎమ్‌టి పి. వెంకటేశ్వర్లు, ఎన్నికల సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్ ఓటును సద్వినియోగం చేసుకోవాలి

అదనపు కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక



**ప్రభాతవార్త సూర్యాపేట:** జిల్లాలో లోకసభ ఎన్నికల నేపథ్యంలో విధులు కేటాయించిన సిబ్బంది ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో తమ పోస్టల్ బ్యాలెట్ ఓటును సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ ఎస్.వి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూర్యాపేట నియోజక పరిధిలో ఎన్నికల విధులు కేటాయించిన సిబ్బంది తమ ఓటు హక్కును సద్వినియోగం కై 6 కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఈ నెల 3 నుండి 8 వరకు ఈ కేంద్రాల నిర్వహణ ఉంటుందని తెలిపారు. ఎన్నికల సిబ్బంది ఇప్పటివరకు 1435 మంది తమ పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్యామ్ సుందర్ రెడ్డి, ఎమ్‌పిటి గోపి, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

కట్టంగూర్, మే 6,ప్రభాతవార్త



మండలంలోని ఈదులూరు ఉన్నత పాఠశాలలోని 1998-99బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఒకరినొకరు కలుసుకొని తమ తమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గత స్మృతులను గుర్తుచేసుకుంటూ సంబరాలు చేసుకున్నారు. అనంతరం తమ గురువులను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో పూర్వ గురువులు వెంకటరెడ్డి, మజీద్‌బాబా, అబ్దుల్‌సలాం,భాస్కర్‌రెడ్డి,నజీర్‌మహ్మద్, కళింగాచారి, ఆదిమూలం శ్రీనివాస్, మదార్,రఘు, మహ్మద్,కక్కిరేణి శ్రీనివాసులు, మేకల సత్యం,కరుణాకర్ పాల్గొనగా పూర్వవిద్యార్థులు లక్ష్మీనారాయణ, సమ్మన్న, శంకర్, రమేష్, సుధాకర్, ప్రవీణ,విజయలక్ష్మి,జ్యోతి, రాధిక, తిరుమలేష్, శ్రీను,సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నష్టపోయాం.. ఆదుకోండి

– రైతు వెంకటనారాయణ



**అనంతగిరి ప్రభాతవార్త:** అనంతగిరి మండలంలోని పాలవరం గ్రామానికి చెందిన దొంతగాని వెంకటనారాయణ అనే రైతు తన 3 ఎకరాల మామిడి తోటలో ఆదివారం రాత్రి వచ్చిన తుఫానుకు భారీ స్థాయిలో మామిడికాయలు నేలపాలయ్యాయి. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ.. వరి పంటలో వచ్చిన నష్టాన్ని మామిడి కాయలు అమ్మి వచ్చిన లాభంతో నష్టాన్ని పూడ్చుకుందాం అనుకున్నాను కానీ తుఫానుకు మామిడికాయలు మొత్తం నేలరాలి తీవ్ర నష్టం వాటిల్లిందని వాపోయారు. దీంతో మళ్లీ తీవ్ర అప్పుల్లో కూరుకొని పోయానని రైతు కన్నీరు మున్నీరయ్యాడు. ఆదుకోవాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని కోరారు.

## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

*నడిగూడెం,మే06,ప్రభాతవార్త :*

అకాల వర్షానికి జిల్లాలో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని మద్దతు ధర కల్పించాలని, జిల్లా రైతు సంఘం నాయకులు ఏనుగుల వీరాంజనేయులు కోరారు. ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి జిల్లాలోని పలు మండలాల్లో ధాన్యం తడిసిపోయిందని అన్నారు. ఐకేపీ కేంద్రాలు, మార్కెట్‌లలో ఉన్న ధాన్యం తడవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయమని కొర్రీలు పెట్టకుండా మద్దతు ధర కల్పించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆయన కోరారు. ఈ ఏడాది యాసంగిలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా పంట దిగుబడి తగ్గిందని అన్నారు. పెట్టిన పెట్టుబడి పూడక రైతులు అప్పుల పాలు అయ్యారని అన్నారు. అనుకోకుండా కురిసిన వర్షాలకు ధాన్యం తడవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నందున కొనుగోలు చేసి నష్టపోకుండా చూడాలని కోరారు.

## మండలంలో ఈదురు గాలులు

*నడిగూడెం,మే06,ప్రభాతవార్త :*

రెండు రోజులుగా సాయంత్రం అవ్వగానే ఈదురుగాలులు వీస్తున్నాయి. తీవ్ర ఎండల కారణంగా సాయంత్రం ఒక్కసారిగా చల్లబడి ఈదురు గాలులు వీస్తుండడంతో ఇండ్లపై కప్పులు లేచిపడుతున్నాయి. పలు చోట్ల చెట్టుకొమ్మలు విరిగి పడ్డాయి. ధాన్యపు రాశులు, ఈదురు గాలులకు చెల్లా చెదురు అవుతున్నాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. విద్యుత్ పునఃరుద్ధరణకు అధికారులు నానా అవస్థలు పడుతున్నారు. విద్యుత్ తీగలు కూడా పలు చోట్ల తెగి పడుతున్నాయి. ఉరుములు, మెరుపులు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. చినుకుల పడు తుండడంతో వాతావరణం చల్లబడి ప్రజలు ఉపశమనం పొందుతున్నారు. తీవ్ర ఎండలతో బెంబేలెత్తుతున్న జనానికి వాతావరణం చల్లబడడంతో ఊపిరి పీల్చుకుంటున్నారు.

## చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

*కోదాడ రూరల్,ప్రభాతవార్త:*

వేసవిలో పాదచారులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా సామినేని యువ సైన్యం సభ్యులు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని పిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని ప్రమీల అన్నారు. సోమవారం పట్టణంలోని జీవి మాల్ పక్కన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. సామినేని యువ సైన్యం ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి ఆదర్శంగా నిలవాలన్నారు. చలివేంద్రం ఏర్పాటు చేసిన యువ సైన్యం అధ్యక్షులు వంగూరి గోపిని ఈ సందర్భంగా వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వంగవీటి రామారావు, కౌన్సిలర్ గంధం యాదగిరి, సామినేని మాజీ సర్పంచ్ వంగూరి ఏసు పాదం, పెద్ద పంగు పాపారావు, మాతంగి అశోక్, వంగూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## బోర్లు మంజూరు చేసి నీటి సమస్యను తీర్చాలి

*నడిగూడెం,మే06,ప్రభాతవార్త :*

తీవ్ర ఎండల కారణంగా భూగర్భనీటిమట్టం అడుగంటి గ్రామాల్లో సాగునీటి సమస్య నెలకొంది. వ్యవసాయ బావులు, బోర్లు ఎండిపోయాయి. గ్రామాల్లో వీధులలో నిర్మించిన చేతిపంపుల్లో నీటిమట్టం తగ్గింది. దీంతో గ్రామాల్లో ప్రజలకు త్రాగునీటి సమస్యఎదురైంది. పలు చోట్ల గ్రామ పంచాయతీ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. నిత్యం మంచినీటి ట్యాంకుల ద్వారా ఇండ్లకు సక్రమంగా నీటి సరఫరా కాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. నీరు పడే చోట బోర్లు మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలోని నడిగూడెం, వేణు గోపాలపురం, కాగితరామచంద్రాపురం, బృందావనపురం, తెల్లబెల్లి, రత్నవరం, తదితర గ్రామాల్లో అదనంగా బోర్లు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు. మిషన్ భగీరథ నీరు కూడా సక్రమంగా సరఫరా కావడం లేదు. తరుచుగా పైపులైన్‌లు లీక్ అవ్వడంతో నీరు వృధాగా పోతున్నాయి. మరమ్మత్తులు జరిపే సరికి జాప్యం జరుగుతుంది. దీంతో మరింత త్రాగునీటి సమస్య ఏర్పడుతుంది. అధికారులు స్పందించి అవసరం ఉన్న గ్రామాలలో బోర్లు నిర్మాణం చేపట్టి ఈ వేసవిలో త్రాగునీటి సమస్య లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా హోర్డింగ్ ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

బొడిగె సైదులు గౌడ్, గీత పనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

*చిట్యాల రూరల్, మే 6, ప్రభాతవార్త:*



ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా గ్రామీణ ప్రాంతాల్లో భారీ హల్డింగ్‌లు ఏర్పాటు చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని గీత పనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులు గౌడ్ అధికారులను సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం అకస్మాత్తుగా గాలి దుమారంతో భారీ వర్షం రావడంతో గ్రామంలోని జాతీయ రహదారి పక్కన సర్వీసు రోడ్డులోని ఓ రెండంతస్తుల భవనంపై ఏర్పాటు చేసిన హోర్డింగ్ కుప్పకూలి పక్కన ఉన్న ఓ ఇల్లు, సైకిల్ రిపేర్ దుకాణంపై పడింది. దీంతో గోడులు, రేకులు దెబ్బతిన్నాయి. బాధితులకు న్యాయం చేసి ఆదుకోవాలని ఆయన అధికారులను కోరారు. ఇలాంటి ఘటనలు పునరా వృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లను వెంటనే తొలగింపజేయాలని ఆయన పేర్కొన్నారు.

## పెద్దమల్లయ్య మృతికి కాంగ్రెస్ నాయకుల నివాళి



*చిట్యాల రూరల్, మే 6, ప్రభాతవార్త:*

చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన బొడిగె పెద్ద మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నమ్ముల విజయ్ కుమార్ గౌడ్ సోమ వారం మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళు లర్పించారు. మృతుడి కుమారుల బొడిగె రమేష్, రామకృష్ణలను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలిపారు. ఆయన వెంట నాయకులు దుబ్బ కుమారస్వామి, బండ అంజయ్య, బండ కిష్టయ్య, దోర్నాల రామచంద్రం, గోపగోని నర్సింహ, అంబాల ప్రవీణ్, చెరుకు స్వామి, బడే రవి, మిద్దెల మధు, నక్కెర్తి శ్రీనివాస్, దొంతరబోయిన శ్రీకాంత్, గోపగోని రామదాసు, రెడపాక యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి రూ.25వేలు ఆర్థిక సహాయం అందజేత

*కోదాడ రూరల్,ప్రభాతవార్త:*



కోదాడ జాతీయ రహదారిపై ఇటీవల కాలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల పరిధిలోని చిమిర్యాల గ్రామానికి చెందిన జిల్లా శ్రీకాంత్, అతని కూతురు మృతి చెందిన విషయం విధితమే. శ్రీకాంత్ కుటుంబాన్ని అదే గ్రామానికి చెందిన గఫూర్ మేస్త్రి, వల్లపు దాసు సురేష్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం పరామర్శించి రూ.25,000 ఆర్థిక సహాయం అందజేసి ఆ కుటుంబానికి బాసటగా నిలిచారు. భవిష్యత్తులో ఆ కుటుంబానికి అండగా నిలబడతానని వాగ్దానం చేశారు. చిమ్మిరాల కాలనీ నిరుపేదలకి భవిష్యత్‌లో కూడా సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. కాగా గఫుర్ కరోనా సమయంలో కూడా చిమ్మిర్యాల గ్రామానికి వంద క్వింటాల బియ్యం, నిత్యవసర వస్తువలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జానకి, నెల్లూరు నాగేశ్వరరావు, రావూరి రాజేంద్ర, రాయల ఉపేంద్ర, అశ్రఫ్, వంకాయలపాటి మోహన్‌రావు, నల్లపాటి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## గోశాల పశుగ్రాసం వితరణ

*చిట్యాల రూరల్, మే 6, ప్రభాతవార్త:*



చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన బండ అంజయ్య, భీమిడి చిన్నవెంకట్‌రెడ్డి, చెరుకు స్వామిగౌడ్, చెరుకు ప్రవీణ్ గౌడ్‌లు కట్టంగూర్ మండలంలోని శ్రీకృష్ణ గోశాలకు ఒక డిసిఎం పశుగ్రాసాన్ని వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోవుల సంరక్షణకు తమవంతుగా వరిగడ్డిని కొనుగోలుచేసి గోశాలకు పంపించినట్లు తెలిపారు. నానాటికి తరిగిపోతున్న గోమాత విశిష్టత నేటి యువతరానికి తెలియదన్నారు. మూగజీవాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. గోవులను రక్షించుకునేందుకు మరింత మంది దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గడ్డిని వితరణ చేసిన వారికి గ్రామస్తులు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ చైర్మన్ అంతటి శ్రీనివాస్, గరిషె చిట్టిబాబు, నర్సింగ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు

*కేతేపల్లి, మే 6,ప్రభాతవార్త:*

మండలంలో మంచినీటి ఎద్దడి రాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని కేతేపల్లి యంపిడివో బి. శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈ వేసవిలో మండలంలోని అన్ని గ్రామాలలో త్రాగునీటి సమస్యలను గుర్తించామని అందకు అనుగుణంగా గ్రామాలలోని చేతి పంపులన్నింటిని నీరు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మరమ్మత్తులకు గురైన చేతి పంపులను గుర్తించి యుద్ధపాతిపదకన వాటిని బాగు చేయిస్తున్నామని కొత్తగా బోర్లు వేయించేందుకు కూడా ప్రతిపాదనలు పంపించామని ఆయన తెలిపారు.



# గాలివాన భీభత్సం

## కూలిన చెట్లు,స్తంభాలు,తెగిన విద్యుత్ తీగలు

## గాలికి లేచిపోయిన ఇండ్ల పైకప్పులు

ఆత్మకూర్(ఎస్),6మే,ప్రభాతవార్త:

మండల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం సాయంత్రం గాలివాన భీభత్సం సృష్టించింది.ఒక్కసారిగా గాలి వాన ఉరుములు,మెరుపులు భయాంధోళన సృష్టించాయి.మండలంలోని సూర్యాపేట దంతాలపల్లి రోడ్డుపై పాతర్లపహాడ్ స్టేజి నుండి సుమారు 3 కిలోమీటర్ల మేర భారీ చెట్లు కూలి పడి రాకపోకలు నిలిచిపోయాయి.సుమారు గంటన్నరకు పైగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.నూతనకల్ పేషెంట్‌తో వస్తున్న అంబులెన్స్ కూడా ట్రాఫిక్‌లో చిక్కుకుపోయింది.పాతర్లపహాడ్‌లో సోములు ఇంటిపై విద్యుత్ స్తంభం విరిగిపడింది.ఈ ప్రమాదంలో ఇల్లు ధ్వంసం అయ్యింది.ఏపూరులో సానబోయిన సోమయ్య తన గేదెను ఇంటిముందు చెట్టుకు కట్టేయగా, చెట్టు కూలి గేదెపై పడి గేదె మృతి చెందింది.పీపనాయక్ కర్రోని తండాలో గుగులోతు బుజ్జయ్య రేకుల ఇల్లు గాలికి లేచిపోయింది.రేకుల తండాలో



రేషన్ షాపుపైకప్పు రేకులు లేచిపోవడంతో బియ్యం బస్తాలు తడిసిపోయాయి.గట్టికల్‌లో మడ్డి సాలమ్మ ఇంటిముందు వేపచెట్టు విద్యత్ తీగలపై పడటంతో తీగలు తెగి రోడ్డుపై పడ్డాయి.పాతర్లపహాడ్ స్టేజి వద్ద రావుల సతీష్,భద్రయ్య లక్ష్మయ్య,మధుకర్, సురేష్‌ల రేకుల ఇండ్లపై కప్పులు విరిగి పూర్తిగా లేచిపోయాయి.పాత సూర్యాపేటలో విద్యుత్ మెయిన్ లైన్ స్తంభం గూడూరు వెంకట్‌రెడ్డి ఇంటిపై పడి ఇల్లు ధ్వంసం అయ్యింది.గొర్రెలకు తీవ్ర గాయాలు అయ్యాయి.వాళ్లపు శంకర్, కొప్పు హరీష్‌ల ఇండ్ల రేకులు వరిగి పూర్తిగా గాలికి లేచిపోయాయి.

# పశువుల సంరక్షణ చర్యలు చేపట్టాలి

- నీటి తొట్లలో నీరు నింపేల చూడాలి
- పాల ఉత్పత్తులు పెరిగేలా అవగాహన కల్పించాలి
- జిల్లా పశుసంవర్ధక శాఖాదికారి డా॥కుమారస్వామి

ప్రభాతవార్త సూర్యాపేట:

వేసవి తీవ్రత నేపథ్యంలో పశువుల సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా॥ కుమారస్వామి సూచించారు. సోమవారం పురుషుల సంరక్షణపై మండల వైద్యాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్టిలో పెట్టుకొని పశువులసంరక్షణకై అన్ని మండలాల్లో పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. పశువులు ఎండలకుసైతం వెరవకుండా విజయవంతంగా గాలికుంటూ నివారణ టీకాలు పూర్తిచేసేనందులకు జిల్లా పశువైద్యాధికారులను అభినందించారు. వేసవిలో పశువులకు తాగునీటిసమ స్యలేకుండా ప్రతీ గ్రామములో రెండు నీటి తొట్లు ఉండేలా గ్రామపంచాయతీల సహకారంతో ఏర్పాటు చేయాలని సూచించారు. పశువులని ఉదయం 6 గంటల నుండి పది గంటల లోపు అలాగే సాయంత్రం 4 గంటల తరువాతనే మేతకు బైటకు పంపించాలని అన్నారు. మధ్యాహ్నం వేళల్లో పశువులకు ఇంటివద్ద పచ్చిగట్టి, చల్లటి నీరు అందుబాటులో ఉంచాలని లాగే పశుపోషకులకు పశువుల్లో వేసవి తాపం యాజమాన్యంపై అవగాహనకల్పించాలని సూచించారు. గ్రామాల్లో ఇండ్ల వద్ద, బిల్డింగ్ల పై పక్షుల తాగునీరు కై పాత్రల్లో మంచినీరు అందుబాటులో ఉంచేలా ప్రజల్లో ప్రచారం చేయ్యాలని సూచించారు. పశుసంక్షేమ పథకాల రూపకల్పనలో అతి ముఖ్యమైన వేసవికాల శాంపిల్ సర్వే, ప్రణాళికా బద్ధంగా నిత్వహించాలని తద్వారా పశుసంపద ఉత్పత్తులపై సమగ్ర నివేదిక ప్రభుత్వానికి అందించేందుకు వీలుగా ఉంయుండని తెలిపారు. కార్యాలయాల్లో, రికార్డుల నిర్వహణపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమములో అసిస్టెంట్ డైరెక్టర్ డా॥పై పెంటయ్య మాట్లాడుతూ రికార్డులు శాఖ, ఉద్యోగుల పనితీరు క్రమశిక్షణ అలాగే జవాబుదారీ తనానికి ప్రామాణికాలనీ, ప్రతీ రిసిస్టర్ నిబంధనల ప్రకారం నిర్ణీత కాలంలో నిర్వహిస్తూ వాటి జీవితకాలాన్ని బట్టి భద్రపరచాలని వివరించారు. సమీక్షా సమావేశమలో జిల్లా కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ బి.వెంకన్న ప్రాంతీయ పశు వైద్యశాలల అసిస్టెంట్ డైరెక్టర్స్, సమస్త జిల్లా పశువైద్యులు తదితరులు పాల్గొన్నారు.



# గాలి దుమారానికి నేల రాలిన మామిడి

## నష్టపరిహారం అందించాలని కోరుతున్న రైతులు

## పట్టించుకోని అధికారులు

పెన్‌పహాడ్,6మే,ప్రభాతవార్త:

ఈ సంవత్సరం మార్చి ,ఏప్రిల్ నెలల విపరీతమైన ఎండలతో అతలాకుతలమైన జన జీవనం మే నెల చేరుకుని ఆరు రోజులు కావడంతో మండలంలోని గ్రామాలలో ఏప్రిల్ నెలలో రోజుకు 44నుండి 47 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా, ఆదివారం రాత్రి ,సోమవారం సాయంత్రం వచ్చిన అకాల గాలి దుమారం వర్షానికి మండలంలోని మామిడి తోటలు చేతికి వచ్చిన మామిడి కాయలు రాలి కుప్పలుగా పడిపోవడంతో ఈ సంవత్సరం మామిడి పంటలు సరిగా లేకపోగా , ఈ గాలి దుమారానికి కొద్దో గొప్పో కాసిన మామిడి కాయలు నేలరాలి తీవ్రంగా నష్టం జరిగిందని రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ధూపహాడ్,లింగాల ,పెన్ పహాడ్ అనంతారం గ్రామాల రైతులు చెట్ల కింద రాలిన మామిడి కాయలను చూసి లబోదిబోమంటున్నారు. ఇంత నష్టం జరిగినా సంబందిత



అధికారులు కనీసం తోటలను సందర్శించకుపోవడం, నష్ట పరిహారాన్ని అంచనా లేకపోవడంతో తీవ్ర మనోవేధనకు గురవుతున్నారు.లింగాల గ్రామంలో లొడంగి మధు, జూకూరి సైదులు, గార్లపాటి శ్రీనివాస్‌రెడ్డి, వీరితోపాటు దూపహాడ్ గ్రామంలో మరి కొందరు రైతులు చేతికందిన మామిడి కాయలు అకాల వర్షం, గాలి దుమారానికి నేల రాలిపోవడంతో దిక్కుతోచని స్థితిలో కన్నీటి పర్యంతం అవుతున్నారు.ఇప్పటికైనా సంబందిత అధికారులు మామిడి తోటలను సందర్శించి నష్ట పరిహారం అంచనా వేసి తమకు నష్ట పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన

పెన్‌పహాడ్,6మే,ప్రభాతవార్త:

మండలంలోని లింగాల గ్రామానికి చెందిన సిద్దపంగి తిరుపతమ్మ అనారోగ్యంతో గత నాలుగు రోజుల క్రితం మృతి చెందగా, విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకులు దొంగరి గోపికృష్ణ సోమవారం మృతురాలి కుమార్తెకు పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన యువకుడు రాజేష్ రణపంగ మాట్లాడుతూ గ్రామంలో నిరుపేద కుటుంబాలకు సహాయం చేసి ఇంటికి పెద్ద దిక్కుగా ఉంటున్న దొంగరి గోపికృష్ణ సేవలు అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో రణపంగ దుర్గయ్య, జార్జి,సురేష్, ప్రేమ్,రాములు,తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట వార్త

మెతే, పెన్‌పహాడ్, సూర్యపేట,ఆత్మకూర్,

# పోలీసుల సేవ అభినందనీయం

ఆత్మకూర్(ఎస్),6మే,ప్రభాతవార్త:



ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి సూర్యాపేట నుండి దంతాలపల్లి రోడ్డులో పాత సూర్యాపేట స్టేజి నుండి నెమ్మికల్ వరకు సుమారు 20 చెట్లు విరిగి రోడ్డుకు అడ్డంపడగా, ట్రాఫిక్ నిలిచిపోయింది.సుమారు గంట వరకు రాకపోకలు ఆగిపోయాయి.పేషెంట్‌తో వస్తున్న అంబులెన్స్ కూడా ఆగిపోయింది. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి జెసిబిని తెప్పించి రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న చెట్లను తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఇందుకు సహకరించిన మహేష్‌కు, ఆపరేటర్ రాకేష్, పోలీస్ సిబ్బందికి ఎస్ఐ సైదులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురి కావద్దు

## ఎస్ఐ జూకూరి సైదులు

నూతనకల్,6మే,ప్రభాతవార్త:



ఓటర్లు ఎన్నికల సమయంలో ఎలాంటి ప్రలోభాలకు గురి కావద్దని , స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ జూకూరి సైదులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఓటర్లకు ఓటు హక్కును, విధులను తెలియజేస్తూ ఓటు హక్కును వినియోగించుకోవడానికి కావల్సిన భరోసాను కల్పిస్తూ పోలీస్ ఫోర్స్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ,ఓటు మన హక్కుఅని, ఓటు వజ్రాయుధంలాంటిదని, దానిని సక్రమ మార్గంలో ఉపయోగించినప్పుడే మన భావి తరాలకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకట్‌రెడ్డి, 20మంది సిఐఎస్ఎఫ్ ఫోర్స్ సభ్యులు,పోలీస్ స్టేషన్ సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో మాస శివరాత్రి ప్రత్యేక పూజలు




**రాజాపేట ప్రభాతవార్త:**
రాజాపేట మండల కేంద్రంలోని అతి పురాతన మహిమాన్విత కోరిన కోర్కెలు తీర్చే శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో మాస శివరాత్రి సందర్భంగా సోమవారం ప్రత్యేక విశేష పూజలు జరిగాయి. ఆలయ అర్చక స్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ మంత్రోచ్చారణలు పూజలు నిర్వహించగా, భక్తులు, పుణ్య దంపతులు, నారీ శక్తి సభ్యులు, విద్యార్థులు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ట్రస్ట్, అభివృద్ధి సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు శివునికి త్రిదళంతో వివిధ రకాల పంచ అమృతాలు స్వామివారికి ప్రీతికరమైన ద్రవాలతో అభిషేకం చేశారు. పలువురు పుణ్య దంపతులు పూజల్లో పాల్గొన్నారు. మాస శివరాత్రి సందర్భంగా విశేషమైన రోజు సోమవారం కావడంతో భజనలు నిర్వహించారు. కార్యక్రమ విశిష్టతను ఆలయ అర్చక స్వాములు వివరించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ వేద ఆశీర్వచనం నిర్వహించారు. ప్రసాద్ దాత మంచాల భద్రయ్య కవిత దంపతులు కుటుంబ సభ్యులకు నిర్వాహకులు కృతజ్ఞతలు చెప్పారు. ప్రతినెల మాస శివరాత్రి రోజున శ్రీ స్వామివారికి అభిషేక పూజలు భక్తులచే నిర్వహించబడతాయని నిర్వాహకులు చెప్పారు. బల్ల దామోదర్, రంగ నరి ...ంలు, పబ్బోజు రాధమ్మ, కటకం లక్ష్మణ్, నంగునూరు రాజేశ్వర్, బ ...జుగం చంద్రశేఖర్, కోనూరు బిక్షపతి, భాగ్యలక్ష్మి, పార్వతి, నారీశక్తి మహిళలు పాల్గొన్నారు



# ప్రతి ఇంటిలో భగవద్గీత ఉండాలి

**ఆలేరు ప్రభాతవార్త:**
ఆలేరు మండలం, గ్రామం షరాజీపేట గ్రామంఒల సోమవారం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక సభ్యులు భగవద్గీత అనుబంధ గ్రంథాలను గ్రామస్తులకు వివరించి పరిచయం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల స్వామివారు రచించిన 100 ఆధ్యాత్మిక గ్రంథాలను, ఉగాదితో మొదలయ్యే తెలుగు క్యాలెండర్ పంచాంగాలను ప్రతి ఒక్కరు తీసుకొని చదవాలని కోరారు. హిందు అంటే జ్ఞాని అని పూర్వం హిందుత్వం ప్రపంచంలో ప్రతి దేశంలో కలదని, హిందుత్వానికి పుట్టినిల్లు భారతదేశం అని, అలాంటి దేశమైన మన దేశాన్ని అన్ని దేశాలు హిందూ దేశంగా పిలిచాయని చెప్పారు. ప్రస్తుతం అదే పేరుతో ఇండియా అని ఇంగ్లీషులో పిలుస్తున్నారని, హిందూ దేశమే ఇండియా అని నెహ్రూ ఇందిరా గాంధీకి రాసిన లేఖలో వివరించారు. సనాతన ధర్మమైన బ్రహ్మవిద్య శాస్త్రంలో ఉన్నటువంటి సాంప్రదాయాలకు పూర్వ వైభవం రావాలని, మళ్లీ ప్రపంచ దేశాలు కొనియాడేల భారతదేశం జ్ఞానులు కలిగిన దేశంగా జ్ఞాన దేశంగా.. హిందూ దేశంగా వెలుగొందాలని కోరారు. కాబట్టి ప్రతి ఒక్కరూ భగవద్గీతలో



శ్రీకృష్ణ భగవానుడు చెప్పినటువంటి ధర్మాలను ఆచరించి అందరికీ తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక సభ్యులు, భువనగిరి జనగం చేర్యాల తొర్రూరు హైదరాబాద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను సన్మానించిన ఎమ్మెల్యే


**ఆత్మకూరు(ఎం) ప్రభాతవార్త:**



ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన పాశం దక్షిత(10/10), నోముల లోహిత(9.5/10), రాచమల్ల బాలాజీ(9.0/10)లను ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య శాలువాతో సత్కరించి, భవిష్యత్‌లో మంచిగా చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి, ప్రభుత్వానికి మంచి పేరు ప్రఖ్యాతలను తీసుకురావాలని, అలాగే తమకు ఏటువంటి ఇబ్బందులు, సమస్యలు ఉన్నా తనను సంప్రదించాలని, అన్ని విధాలుగా సహకరిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్ధులు, ప్రధాన కార్యదర్శి కందడి అనంతరెడ్డి, కట్టెకోల హన్మంతు గౌడ్, ఓబీసీ మండల అధ్యక్షుడు బత్తిని ఉప్పలయ్య గౌడ్, మాజీ సర్పంచ్ జన్నాయికోడె నాగేష్, తండ శ్రీశైలం, బాషబోయిన పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి సీలింగ్ ఫ్యాన్ బహుకరణ

**తుర్కపల్లి ప్రభాతవార్త:**



తుర్కపల్లి మండలం ములకలపల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి గ్రామానికి చెందిన కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు బాలు యాదవ సీలింగ్ ఫ్యాన్‌ను ఏఎన్ఎం సంధ్యకు అందజేశారు. ఆశా వర్కర్లు మంగ, అంబిక, గ్రామస్తులు వేణు, రాజు, మల్లెబోయిన శివకుమార్, మల్లెబోయిన కుమార్, దయాకర్ పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు చల్లటి నీటిని పంపిణీ చేస్తున్న రాజు గౌడ్

**తుర్కపల్లి ప్రభాతవార్త:**



తుర్కపల్లి మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథక కూలీలకు వేసవి కాలంలో వారు తాగడానికి చల్లట మంచినీటిని గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా నాయకుడు దొంకెన రాజు గౌడ్ పంపిణీ చేశారు. .. వేసవికాలం పూర్తయ్యేంతవరకు ఉపాధి హామీ కూలీలకు చల్లటి త్రాగునీరు తన వంతుగా ప్రతిరోజు అందిస్తామని అన్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలు మాట్లాడుతూ.. చల్లటి నీటిని అందజేయడం సంతోషంగా ఉందని అన్నారు.

## యాదాద్రి భువనగిరి వార్త

## విద్యుత్‌ఘాతంతో పాడిగేదె మృతి

**గుండాల, ప్రభాతవార్త :**



విద్యుత్ ప్రమాదానికి గురై పాడి గేదె చనిపోయిన సంఘటన సోమవారం సాయంత్రం మండలంలోని పెద్దపడిశాల గ్రామంలో చోటుచేసుకుంది. రోజువారీ కార్యక్రమంలో భాగంగా నత్తి కృష్ణ అనే వ్యవసాయ రైతు తన పాడిగేదెను మేత కోసం వ్యవసాయ బావుల వద్దకు తోలుకుపోయారు. పక్కనే ఈదురు గాలులకు తెగిపడ్డ విద్యుత్ వైరు గేదెకు తగలడంతో అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయింది. బాధితుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎం.డి.ఖలీల్ జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

## మన ఓటు-మన భవిష్యత్ రక్షణకు ప్రతీక

**ఆలేరు ప్రభాతవార్త:**
ఒక్కసారి ఆలోచించి, మన భవిష్యత్తుకు బాట వేసే, అభివృద్ధిని కాంక్షించే, నీతి- నిజాయితీపరమైన వ్యక్తిని చూసి మీ అమూల్యమైన ఓటు వేయండి.. డబ్బు, మద్యం ప్రలోభానికి గురై ఓటు వేసి మీ జీవితాన్ని చీకటిమయంలోకి వెళ్లనివ్వకండి అని నవ సామాజికవేత్త, విజన్ వివేకానంద కోచింగ్ సెంటర్ కరెస్పాండెంట్ కుంతావత్ కమలాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**తుర్కపల్లి ప్రభాతవార్త:**



మండల కేంద్రంలోని పడాల ముత్యాలు మెమోరియల్ హై స్కూల్ 2002-03 సంవత్సర పదవ తరగతి విద్యార్థులు సోమవారం వాసాలమర్రి గ్రామ పరిధిలోని పలుగుల మైసమ్మ తల్లి దేవాలయం ప్రాంగణంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు ఏ ఏ రంగంలో స్థిరపడ్డారో అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో చదువుకున్న రోజులు మరువలేనివి అని నెమరు వేసుకున్నారు. అనంతరం విద్యా నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పోగుల ఆంజనేయులు, నాంసాని సత్యనారాయణ, పలుగుల శ్రీనివాస్, బబ్బురి రజినీకాంత్, శ్రీనివాసును విద్యార్థులు ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఇమ్మడి సంతోష్ కుమార్, అంబటి పృథ్వీరాజ్, కర్నే భాస్కర్, అన్నోజు భీష్మాచారి, మేకల బాలకృష్ణ, ఆనంద్ చారి, భుక్యా శ్రీనివాస్, బునారి భాస్కర్, తాటికొండ బాలరాజు, రాజు, ఎల్లేష్, బోరెడ్డి మనోహర, మాధవి, స్వప్న, పర్వీన్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# నరేంద్ర మోదీ నాయకత్వంలోనే భారత్ సమగ్రాభివృద్ధి





మొదటి పేజీ తరువాయి

పదేళ్ల మోడీ పాలనలో దేశం సాధించిన విజయాలు, అభివృద్దిని చూసి ప్రపంచ దేశాలే ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలో రెండో స్థానంలో నిలిచిందన్నారు. 80 కోట్ల మందికి నిత్యవసర సరుకులు దేశమంతా ఉచితంగా అందించిన ఘనత మోడీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. గత 2014 నుంచి తొలి సారిగా ఎంపీగా గెలిచిన బూర నర్సయ్యగౌడ్ ఈ ప్రాంత ప్రజల మనస్సులో సుస్థిర స్థానం సంపాదించుకుంటూ ఈ ప్రాంత అభివృద్ధి కోసం పాటుపడుతున్న వ్యక్తి అన్నారు. ఈ సారి ఆదరించి బూర నర్సయ్యగౌడ్‌కు భారీ విజయాన్ని అందించడంతోనే మోడీ మూడో సారి ప్రధాని కావడం ఖాయమని, సద్వారా ఈ ప్రాంత అభివృద్ధి మరింత వేగంగా ముందుకు వెళ్లేందుకు దోహదపడుతుందన్నారు. సోనియా, రాహుల్, కేసిఆర్‌లు జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. మోడీ నాయకత్వంలోనే రామ మందిరం కట్టడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ సనాతన ధర్మాన్ని విస్మరించిందన్నారు. మోడీ ఉగ్రవాద దేశాలపై ఉక్కుపాదం మోపారని, ప్రధాన మంత్రి గ్రామీణ ఆవాస్ యోజన పథకం కింద నాలుగు కోట్ల ఇండ్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతుందన్నారు. బూర గెలుపుతోనే ఈ పథకం ఈ ప్రాంత ప్రజలకు మరింత సులభతరం అవుతుందన్నారు. సుమారు జన సభలో 33 నిమిషాల పాటు నడ్డా ప్రసంగం సాగింది. బిజెపి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ ఐదేళ్ల పాటు ఎంపీగా పనిచేసిన అనుభవం తనకు ఉందని, ఈ ప్రాంత ప్రజలు, సమస్యలపై మండలాలు, గ్రామాల వారిగా సంపూర్ణ అవగాహన ఉందన్నారు. వాటి పరిష్కారం కోసం ప్రధానిగా మోడీ మూడో సారి కావడం ఖాయమని, అతడి సహకారంతో పరిష్కరించుకునేందుకు వీలుందన్నారు. తనను ఆదరించి భారీ విజయాన్ని అందించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, పగడాల శ్రీనివాస్, కొప్పు బాష, చాడ సురేస్‌రెడ్డి, తాడూరి శ్రీనివాస్, పాపారావు, బిజెపి జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, పార్లమెంటరీ కన్వీనర్ బందారపు లింగస్వామి, రాష్ట్ర నాయకులు గూడూరు నారాయణరెడ్డి, దోనూరి వీరారెడ్డి, చందుపట్ల వెంకటేశ్వర్‌రావు, దాసరి మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షులు రామనగోని శంకర్, దూడల భిక్షం, దాసోజు భిక్షమాచారి, కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, మల్లేశం, బాతరాజు సత్యం, మునగాల రాజశేఖర్‌రెడ్డి, ఉష్కాగుల నాగరాజు, ఆలె చిరంజీవి, నాగరాజు, బత్తుల జంగయ్య, పబ్బు వంశీ తదితరులున్నారు.

## బిజెపిలో భారీ చేరికలు..

చౌటుప్పల్ మండలం తంగడపల్లిలో సోమవారం నిర్వహించిన బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి.నడ్డా బహిరంగ సభలో పలు పార్టీలకు చెందిన నాయకులు బిజెపిలో చేరారు. బీబీనగర్ మండలానికి చెందిన టిఆర్ఎస్ నేత సర్వోత్తంరెడ్డి, చందుపట్ల వెంకటేష్, చౌటుప్పల్‌కు చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ముత్యాల భూపాల్‌రెడ్డి, మున్సిపల్ ఆరో వార్డు కౌన్సిలర్ ఆలె నాగరాజులు తమ అనుచరులతో కలిసి ఆయా పార్టీలకు రాజీనామా చేసి బిజెపిలో చేరారు. బిజెపి విజయం కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, పగడాల శ్రీనివాస్, కొప్పు బాష, చాడ సురేస్‌రెడ్డి, తాడూరి శ్రీనివాస్, పాపారావు, బిజెపి జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, పార్లమెంటరీ కన్వీనర్ బందారపు లింగస్వామి, రాష్ట్ర నాయకులు గూడూరు నారాయణరెడ్డి, దోనూరి వీరారెడ్డి, చందుపట్ల వెంకటేశ్వర్‌రావు, దాసరి మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షులు రామనగోని శంకర్, దూడల భిక్షం, దాసోజు భిక్షమాచారి, కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, మల్లేశం, బాతరాజు సత్యం, మునగాల రాజశేఖర్‌రెడ్డి, ఉష్కాగుల నాగరాజు, ఆలె చిరంజీవి, నాగరాజు, బత్తుల జంగయ్య, పబ్బు వంశీ తదితరులున్నారు.









# కొనుగోళ్లు వేగవంతం చేయండి

**తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తాం**

**రైతులు అధైర్యపడొద్దు**

**జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావ్**



**ఆత్మకూర్(ఎస్), 6మే, ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ సంబందిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆత్మకూర్ ఎస్ మండలంలోగల పిఏసిఎస్ ధాననయం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం చివరి గింజను కొనుగోలు చేస్తామని ,తడిసిన ధాన్యం వల్ల రైతులు అధైర్యపడవద్దని అన్నారు.అన్ని కొనుగోలు కేంద్రాలలో అకాల వర్షాలవల్ల ధాన్యం తడవకుండా ముందస్తుగా తార్పాలిన్లు అందుబాటులో ఇంచామని , కునుస్తున్న వర్షాలవల్ల ఎక్కడ కూడా రైతులు తెచ్చిన ధాన్యం తడవకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే ట్యాగింగ్ మిల్లులకు పంపాలని ,మిల్లర్లు వెంటనే వాహనాలలో ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని సూచించారు.కొనుగోలు కేంద్రాల ద్వారా 31,335 మంది రైతులనుండి 1,84,485.000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని ,అలాగే రైతులకు ఇప్పటివరకు రూ.225 కోట్లు చెల్లించామని అన్నారు. అన్ని కేంద్రాలలో మండల స్థాయి అధికారులు ,ప్రత్యేక అధికారులు పరిశీలన చేయాలని ఎక్కడ కూడా రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని సూచించారు.కేంద్రాలలో పాత గోనె సంచుల బదులు కొత్త గోనె సంచులు వాడాలని , అలాగే పాతవాటిని తిరిగి పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వినోద్ కుమార్, పిఏసిఎస్ సిబ్బంది,రైతులు ,తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు

**సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పైన ప్రత్యేక దృష్టి**

**జిల్లా ఎస్పి చందనా దీప్తి**

**నల్గగొండ, ప్రభాతవార్త, ప్రతినిధి:** పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు ఏడు కంపెనీల కేంద్ర బలగాలు, 2600 మంది జిల్లా సిబ్బందిలో ఎన్నికల నిర్వహణ పకడ్బందీ భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో శాంతి యుతంగా, నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలీసు యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1677 పోలింగ్ కేంద్రాలు ఉండగా వీటిలో 313 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయని అన్నారు. సమస్యాత్మక గ్రామాలను సిబ్బంది విధిగా పర్యటిస్తూ గ్రామాలపై దృష్టి సారిస్తు ఎప్పటికప్పుడు నిఘా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. జిల్లా పోలీసు సిబ్బంది, కేంద్ర సాయుధ బలగాలు కలిసి ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రజల్లో భరోసా కల్పిస్తూ ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహిస్తూ చైతన్యం కల్పిస్తున్నామని అన్నారు. ఇప్పటి వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ క్రింద 7 కేసులు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు.



# జిల్లాలో పటిష్ట పోలీసు బందోబస్తు

**రూట్ మొబైల్స్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి**

**గ్రామాలు పోలింగ్ కేంద్రాలపై అవగాహన ఉండాలి**

**ఎస్పీ రాహుల్ హెగ్డే**





**ప్రభాతవార్త సూర్యాపేట:** లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల రోడ్డు మొబైల్స్ నందు విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది, అధికారులతో సోమవారము నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో గుంపులుగా చేరకుండా చూడాలని, గ్రామాలు పోలింగ్ కేంద్రాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల సామాగ్రి స్ట్రాంగ్ రూముల నుండి పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు ఎన్నికలు ముగిసి తిరిగి స్ట్రాంగ్ రూములకు చేరేవరకు రూట్ మొబైల్స్ సిబ్బంది అప్రమత్తంగా పనిచేయాలన్నారు. గ్రామాల్లో పరిస్థితులు గమనిస్తూ ఈవీఎంలకు ఎన్నికల సామాగ్రికి పూర్తి భద్రత కల్పించడంతో రూటు మొబైల్ సిబ్బంది ప్రధాన భూమిక అన్నారు. అధికారులతో సమన్వయంతో పని చేయాలన్నారు. సెక్టార్ అధికారులు ఫోన్ నెంబర్స్ కలిగి ఉండాలని ఎలాంటి సమస్య వచ్చినా అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లా పోలీస్ సిబ్బందికి అనుబంధంగా సెంట్రల్ ఆర్మ్ పోలీస్ సిబ్బంది పనిచేస్తుందన్నారు. తమిళనాడు, అరుణాచల ప్రదేశ్, రాష్ట్రాల పోలీస్ సిబ్బంది కూడా విధులు నిర్వహిస్తుందని ఎస్పీ తెలిపారు. జిల్లాలో ఎన్నికల విధులు, పరిస్థితులను వివరించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన సిబ్బందికి స్థానిక పోలీసులు గైడ్గా ఉంటారన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులకు అధికారులు పూర్తి సాహాయ సహకారాలు అందించాలని ఎస్పీ కోరారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 8 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ రాహుల్ హెగ్డూ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి నాగేశ్వరరావు కోదాడ డిఎస్పి శ్రీధర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వీర రాఘవులు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రజిత రెడ్డి, చరమంద రాజు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకోదండ రామాలయంలో భక్తి శ్రద్ధలతో 16 రోజుల పండుగ మహోత్సవం

నేరేడుచర్లటౌన్ మే 6 ప్రభాతవార్త



నేరేడుచర్లలోని శ్రీకోదండ రామాలయంలో సోమవారం 16 రోజుల పండుగ మహోత్సవాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో సాంప్రదాయసిద్ధంగా వైభవంగా నిర్వహించారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయం సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండ రామాలయంలో గత నెల 21న విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను నిర్వహించగా నేడు 16 రోజుల పండుగను జరుపుకున్నారు. గ్రామ పురోహితులు నెమ్మాని వెంకటరమణ, ఆలయ



పూజారి ఆశిష్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పంచామృతాభిషేకాలు, గణపతిపూజ, పుణ్యాహవాచనం తదితర పూజా కార్యక్రమాలను వేద మంత్రాలతో సాంప్రదాయసిద్ధంగా నిర్వహించారు. ఆలయంలోని శ్రీసీతారామచంద్ర లక్ష్మణ సమేత ఆంజనేయస్వామిలను భక్తులు దర్శించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడంతో ఆలయ పరిసర ప్రాంతం కోలాహలంగా కనిపించింది. సాయంత్రం సుందరకాండ శ్రీనివాస్‌లచే సుందరకాండ పారాయణాన్ని నిర్వహించారు. భక్తులకు కావలసిన ఏర్పాట్లను ఆలయ కమిటీ పర్యవేక్షించారు.

## నేరేడుచర్లకు వన్నె తెచ్చిన గమన్‌రెడ్డి

### - లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ యడవెల్లి

నేరేడుచర్లటౌన్ మే 6 ప్రభాతవార్త

తైక్వాండో పోటీలలో జాతీయంగా, అంతర్జాతీయంగా ప్రతిభ చూపుతున్న కొణతం గమన్‌రెడ్డి నేరేడుచర్ల పట్టణానికి వన్నె తెచ్చారని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ బట్టు మధు, జోన్ చైర్మన్ యడవెల్లి సత్యనారాయణరెడ్డిలు ప్రశంసించారు. సోమవారం సాయంత్రం నేరేడచర్లలో జరిగిన గమన్‌రెడ్డి అభినందన సభలో గమన్‌రెడ్డితో పాటు తల్లిదండ్రులను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆత్మరక్షణ కోసం ఉత్తర దక్షిణ కొరియా దేశాలలో ఒకక్రీడగా తైక్వాండో ప్రారంభమై నేడు ప్రపంచ ప్రతిష్టాత్మకమైన ఒలంపిక్స్‌లో చేరిందని, చిన్నారి గమన్‌రెడ్డి అంచెలంచెలుగా ఎదిగి ఒలంపిక్స్‌లో పతకాలు సాధించాలని ఈ ప్రాంతానికి మరింత గుర్తింపు తీసుకు రావాలని కోరారు. ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు ఉదయ్‌రెడ్డి శోభనలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ



కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షులు రావులపల్లి ప్రసాద్, పోరెడ్డి శ్రీరామ్‌రెడ్డి, క్లబ్ కార్యదర్శి జిలకర రామస్వామి, సుంకర క్రాంతికుమార్, వీరమల్ల సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కర్రి సూర్యనారాయణరెడ్డి, కొప్పుల రంగారెడ్డి, ఉప్పుల లక్ష్మారెడ్డి, రవీంద్రారెడ్డి, రంగారెడ్డి, యూసుఫ్, విశ్వనాధ్ తదితరులు పాల్గొన్నారు.

## ఈదురు గాలులకు అకాల వర్షాలకు మామిడి రైతులకు తీరని నష్టం

నేరేడుచర్లటౌన్ మే 6 ప్రభాతవార్త

నేరేడచర్ల మండలంలో ఆదివారం రాత్రి వీచిన ఈదురు గాలులకు అకాల వర్షానికి మామిడి కాయలు రాలిపోయి తీరని నష్టం వాటిల్లిందని మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఊహించని విధంగా ఒకేసారి వీచిన ఈదురు గాలులు, వర్షానికి ఆరుకాలం శ్రమించి పెట్టుబడి పెట్టి చేతికొచ్చిన మామిడి పంట రాలిపోవడంతో అపారనష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కల్లూరు గ్రామంలో, కరణం సత్యనారాయణ, బక్కయ్యగూడెంలో కరణం నర్సయ్య, కరణం అరవిందుల మామిడి కాయలు నేలకొరిగి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున రూ.3 లక్షలు పంట నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. గత సంవత్సరం



కూడా ఈదురు గాలులకు నష్టపోయామని తిరిగి ఈ సంవత్సరం కూడా పునరావృతం అయిందని, ప్రభుత్వం గమనించి తమను ఆదుకోవాలని

హుజూర్ నగర్ వార్త


## శ్రీస్వయంభు శివలింగమునకు ఘనంగా మహన్యాస పూర్వక రుద్రాభిషేకములు

మేళ్లచెరువు మే 6 ప్రభాతవార్త

స్థానిక శ్రీఇష్టకామేశ్వరి సమేత శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామివారి ఆలయంలో సోమవారం సందర్భంగా ఏకాదశ మహన్యాసపూర్వక రుద్రాభిషేకములు, బిల్వ అర్చనలు, పంచామృత అభిషేకములు, అన్నప్రసాద వితరణ, సహస్రనామ అర్చనలు, హారతులు, గుడిసేవలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాలలో కార్యనిర్వహణ అధికారి గుజ్జుల కొండారెడ్డి, చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి, కొంకపాక శివవిష్ణువర్ధనశర్మ, శివధనుంజయశర్మ, కూన్‌రెడ్డి కొండారెడ్డి, లంకెల నర్సింహారెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూమ్‌కు తరలించిన ఈవీఎంలు

మిర్యాలగూడ, మే 6 ప్రభాతవార్త



మిర్యాలగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగంలో రెండ రోజుల పాటు నిర్వహించిన ఈవీఎం, వీవీ ప్యాట్‌ల కమిషనింగ్ ప్రక్రియ సోమవారం ముగిసింది. దీంతో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రావు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సమక్షంలో వాటిని స్ట్రాంగ్ రూమ్ నందు భద్రపరిచి సీల్‌వేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హరిబాబు, శ్రీనివాస్‌శర్మ, జవహర్‌లాల్, డిఐ బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

పెద్దవూర, మే 6 ప్రభాతవార్త:

పెద్దవూర మండల కేంద్రానికి చెందిన కిలారి చెన్నకేశవులుకు గత రెండు సంవత్సరాల క్రితం పెరలాసిస్ రావడం జరిగింది. మందుల వాడకం వల్ల కొద్దికొద్దిగా నయం అవ్వడం జరిగింది. మళ్లీ 10రోజుల క్రితం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రికి వెళ్లగా చిన్న మెదడులో రక్తం గడ్డ కట్టింది సర్జరికి రూ.10లక్షల దాక ఖర్చు అవుతుందని వైద్యులు తెలియజేయడంతో కార్ డ్రైవింగ్ చేసుకుంటూ జీవనం కొనసాగించే చెన్నకేశవులు గత 2 సంవత్సరాలుగా కుటుంబ పరిస్థితులు బాలేక ఇబ్బంది పడుతున్నారు. . వారికి హైదరాబాద్‌లోని రీహబ్లీటేషన్ సెంటర్ వెళ్లి రూ.10వేల సహాయం అందించడం జరిగింది

# కార్మికులకు అండా ఏఐటీయుసీ జెండా

కొండమల్లేపల్లి, మే 6 ప్రభాతవార్త:

ఏఐటీయుసీ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లిలో సోమవారం ఏఐటీయుసీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన మేడే కార్యక్రమంలో ఏఐటీయుసీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నో త్యాగాలు, పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యదావిధిగా కొనసాగించాలని నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కార్మిక చట్టాలు పునరుద్ధరణకై దేశాన్ని రాజ్యాంగాన్ని ప్రజలను రక్షించుకోవడానికి ఐక్య పోరాటాలకు సిద్ధ కావాలని పిలుపునిచ్చారు. అమెరికా నగరం హే మార్కెట్‌లో 1886 మే 1న సమ్మె చేయాలని నిర్ణయించిన ప్రపంచ కార్మికుల సమైకయ సోషలిస్టు, కార్మిక సంఘాల సమ్మె హే మార్కెట్‌లో భారీ నిరసన ప్రదర్శన 8గంటల పరిధికై కదం తొక్కిన కార్మికులు, పెట్టుబడిదారులు, వారి గుండాలు, పోలీసులు జరిపిన తుపాకుల కాలుపులో చనిపోయిన వారి రక్తంతో తడిసి ఎగిసిన ఎర్రజెండా మేడే అని అన్నారు. 75 సంవత్సరాల స్వంత్రంత భారతదేశంలో పౌర ప్రజాస్వామ్య పాలన అంతమైందని పెట్టుబడిదారీ



విధానం కొనసాగుతుందని కార్మిక వర్గం దశాబ్ధులుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలు 29చట్టాలను సమూలంగా రద్దు చేసి పెట్టుబడి దారులకు అనుకూలంగా నాలుగు కోడ్‌లను తెచ్చిందన్నారు. పెన్షన్ చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల ప్రమాద మరణానికి 10లక్షలు చెల్లించాలని నెలకు ఐదు వేల పెన్షన్ ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని ఆయన కోరారు. బ్యాంకులను కుదించరాదని, గ్రామపంచాయతీలో మల్టీపర్పస్ విధానాన్ని సవరించి పెండింగ్‌లో ఉన్న జీతాలను చెల్లించాలని అన్ని రకాల కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యూలర్ చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు అడ్డాల వద్ద షెల్టర్ నిర్మించాలని, మంచి నీరు, కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసీ గౌరవ అధ్యక్షులు జి.వెంకటేశ్వర్‌రెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం మల్లేపల్లి అధ్యక్షులు ముదిగొండ లక్ష్మయ్య, కార్యదర్శి వసుకుల శ్రీనయ్య, భూతరాజు వెంకటయ్య, బెజవాడ రవి, అందుగుల శ్రీనయ్య, ముదిగొండ ఏసు, ఒర్సు నరసింహ, గిరి, వెంకటేష్, శేఖరాచారి, సోమ్లా తదితరులు పాల్గొన్నారు. ముందుగా భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి ఎంపీపీ రేఖశ్రీధర్‌రెడ్డి, జడ్పీటీసీ సలహాదారు పసునూరి యుగంధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కె.వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ ముత్యాలు, సురేష్ పలువురికి సన్మానం చేశారు.

# గ్రామ పంచాయతీ కార్మికులపై కక్షసాధింపు

**-మూడు మూడు-పది నెలలుగా అందని వేతనాలు**

**-ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్న కార్మికులు**



వేములపల్లి ప్రభాతవార్త:

దేవుడు వరమిచ్చిన పూజారి కానుకరించని పరిస్థితిలో గ్రామ పంచాయతీలలో చాలిచాలని వేతనాలతో పనిచేస్తున్న కార్మికులపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు కక్షసాధింపు చర్యలకు పాల్పడడంతో గత పది నెలలుగా వేతనాలు అందకపోవడంతో పూటగడవని పరిస్థితి దాపూరించ్చిందని గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ వేములపల్లి మండల కమిటీ నాయకులు పాల్వాయి సైదులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ వేములపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని రావులపెంట, వేములపల్లి, కామేపల్లి, మంగాపురం, అన్నపురెడ్డిగూడెం, లక్ష్మీమ్మదేవిగూడెం, బుగ్గబాయిగూడెం, సల్కునూరు, తిమ్మారెడ్డి గూడెం గ్రామాలకు చెందిన గ్రామ పంచాయతీ ఉద్యోగులకు మూడు నుంచి పది నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికుల కుటుంబాలు ఆర్థిక పరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కార్మికులకు వేతనాలు రావడం లేదని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులను పలుసార్లు ప్రాధేయపడినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో ఉన్నతాధికారులకు తమ గోడును విన్నవించుకోవడం జరిగిందన్నారు. గత నెల 29వ తేదీన మండల పరిషత్ అభివృద్ధి అధికారికి వేతనాలు ఇప్పించమని వినతిపత్రం ఇచ్చిన ప్రయోజనం లేకపోగా కార్మికుల గోడును పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. కార్మికుల పట్ల గ్రమా కార్యదర్శులు తీరు ఇబ్బందిగా మారిందని, ఉన్నతాధికారుల దృష్టికి తమ సమస్యలను తీసుకొని వెళితే మండలాధికారికి దగ్గరికి ఎలా వెళ్లారని కొందరు కార్యదర్శులు కక్ష సాధింపు ధోరణితో కార్మికులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారన్నారు. కార్మికులకు వేతనాలు సకాలంలో చెల్లించకపోవడంతో కుటుంబ పరిస్థితి భారంగా మారిందని, చేసిన అప్పులు తీర్చలేక తమకు ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామ పంచాయతీ కార్మికులకు రావాల్సిన పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ వేములపల్లి మండల కమిటీ నాయకులు సతీష్, వెంకన్న, బ్రహ్మాచారి, పరిపూర్ణాచారి, రవి, రామయ్య, నగేష్, ఆనందం, లింగయ్య, ఈదమ్మ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్లపై నుండి వెళ్లిన విద్యుత్ తీగలను తొలగించాలని ఆంధోళన

పెన్‌పహాడ్,6మే,ప్రభాతవార్త:

మండల పరిధిలోని ధూపహాడ్ గ్రామంలో గత కొన్ని ఏళ్లుగా ఇండ్లపైనుండి వెళ్లిన 11 కెవి విద్యుత్ వైర్‌ను వెంటనే తొలగించి తమ ఆస్తులను , ప్రాణాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.గత కొన్ని ఏళ్లుగా ఈ విద్యుత్ వైర్లు ఉండటంతో అకాల వర్షాలకు వైర్లు తెగి ఇండ్లపై పడతాయేమోనని వారు ఆంధోళన చెందుతున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల గాలి ,వర్షం వచ్చినప్పుడు గడ్డివాములు, చెట్టు కొమ్మలు తగిలి మంటలు చెలరేగుతున్నాయని దీంతో ఇబ్బందులకు కలగడమే కాకుండా భయాంధోళకు గురవతున్నామని, విద్యుత్ తీగలు తెగి ఎప్పుడు తమపై పడతాయో తెలియని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. వెంటనే విద్యత్ అధికారులు స్పందించి వైర్లను తొలగించి గ్రామం వెలుపల నుండి విద్యుత్ వైర్లను ఏర్పాటు చేసుకోవాలని కోరుతున్నారు.విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోకపోతే గ్రామంలో పార్లమెంటు ఎన్నికలు జరగనీయబోమని , బూతులు పెట్టనీయమని,ప్రజలకు అనుకూలంగా వైర్లు తొలగించిన తరువాతనే ఎలక్షన్లు నడిపించాలని గ్రామ రైతులు, బాధితులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో బిట్టు వీరయ్య, దొంగరి హరీష్, దొంగరి సోమేశ్వర్‌రావు, బిట్టు రాంబాబు, దొంగరి వెంకటేశ్వర్లు, ముదిగొండ నాగయ్య, దొంగరి నారాయణ, ముదిగొండ నరేష్, గోకని సంపత్, అన్నపూర్ణ, నాగమణి ,లక్ష్మి,కోటమ్మ, పద్మ,తదితరులు పాల్గొన్నారు.



# ఇండియా కూటమి అభ్యర్థికే మా మద్దతు

త్రిపురారం,6మే,ప్రభాతవార్త:



మతోన్మాద , కార్పోరేట్ శక్తులను అడ్డుకునేందుకు లౌకిక , సెక్యులర్ పార్టీలన్ని ఏకం కావాలని సిపిఐ(ఎం) మండల కార్యదర్శి ధైద శీను అన్నారు.సోమవారం స్థానికంగా గూగుల్ ఇద్దయ్య అధ్యక్షతన నిర్వహించిన పార్టీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ఏర్పాటు అయిన ఇండియా కూటమిని అధికారంలోకి తీసుకువచ్చేందుకు భావసారూప్యం కలిగిన పార్టీలన్ని ఏకం కావాలన్నారు. అందులోభాగంగానే నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని బలపరుస్తూ ఆయనకే మా సంపూర్ణ మద్దతు అన్నారు.ఈ సమావేశంలో పార్టీ మండల కమిటి సభ్యులు కొప్పు వెంకన్న, ఈదయ్య, వెంకటయ్య, రామచంద్రు, నర్సి రెడ్డి,విష్ణుమూర్తి,తదితరులు ఉన్నారు.


# ఈదురు గాలులకు రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్టు

**-నిలిచిపోయిన రాకపోకలు**

:

పెద్దవూర, మే 6 ప్రభాతవార్త:

మండల పరిధిలోని చలకుర్తి -కుంకుడు చెట్టుతండా, జవహర్ నవోదయ విద్యాలయం, తూర్పుపూలగూడెం మార్గంలో ఆదివారం రాత్రి వీచిన ఈదురు గాలులకు రోడ్డు పక్కన ఉన్న పెద్ద తుమ్మచెట్టు విరిగి రహదారికి అడ్డంగా పడిపోయింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అంతేగాక హరితహారంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు ఈదురు గాలులతో కూడిన వర్షం పడడంతో చెట్లు, కొమ్మలు విరిగి రోడ్డుపై పడ్డాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు చెట్లకొమ్మలు తొలగించాలని కోరుతున్నారు.



## తుంగతుర్తి వార్త

తిరుమలగిరి, మోత్కూర్, శాలిగౌరారం, అడ్డగూడూరు, నాగారం

# విద్యాత్‌ఘాతానికి గురై రెండు పాడి గేదెలు మృతి


వేములపల్లి ప్రభాతవార్త:



విద్యుదాఘాతానికి గురై రెండు పాడి గేదెలు మృతి చెందిన సంఘటన సోమవారం వేములపల్లి మండలంలోని తిమ్మారెడ్డిగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం తిమ్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన చింతరెడ్డి సైదిరెడ్డి, లేకిరెడ్డి మంగమ్మల పాడిగేదెలు ఇంటి నుంచి రోజువారీగా గ్రామ సమీపంలోని పొలాల్లోకి మేతకు వెళ్లాయి. పాడి గేదెలు మేత వేసుకుంటూ వెళుతున్న క్రమంలో పొలం గట్టు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి సపోర్టుగా ఉన్న తీగను తాకడంతో విద్యుతాఘాతానికి గురై రెండు పాడి గేదలు అక్కడికక్కడే మృతి చెందాయి. మృతి చెందిన పాడి గేదెలు ఒక్కొక్కటి సుమారు రూ.40వేలు ఉంటాయని, పాడిపై ఆధారపడి జీవిస్తున్న తమకు ప్రభుత్వము ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని బాధితులు కోరారు.

# అకాల వర్షం అపార నష్టం

శాలిగౌరారం ప్రభాతవార్త:



శాలిగౌరారం మండలంలో ఆదివారం రాత్రి అకాల వర్షంతో పాటు భారీ ఈదురుగాలులకు అపార నష్టం కలిగింది. దాదాపు 15 విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. చేతి కొచ్చిన నిమ్మ, మామిడి కాయలు నేల రాలాయి. 10 ఇండ్ల కప్పులు లేచిపోగా 2 ఇల్లులు పూర్తిగా కూలిపోయాయి. తుడిమిడి గ్రామానికి చెందిన బండారు యాదయ్య మామిడి తోటలో తోట ధ్వంసమై మామిడి కాయలు రాలిపోయాయి. పెర్కకొండారంలో మంగదుడ్ల బలరాంకు చెందిన 3 ఎకరాల నిమ్మ తోట ధ్వంసమై నిమ్మకాయలు నేల రాలాయి. గురజాలో చాట్ల బయన్న ఇల్లు పూర్తిగా లేచిపోవడంతో నిరాశ్రుడుయ్యాడు.. సంబంధిత అధికారులు పరిశీలించి నష్టపరిహారం చెల్లించాలని బాధితులు కోరుతున్నారు.

# ఘనంగా మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకళ్యాణం



మఠంపల్లి మే 6 ప్రభాతవార్త

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకళ్యాణంను అర్చకులు శాస్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కళ్యాణ తంతు కార్యక్రమాన్ని వందలాదిమంది భక్తుల నడుమ అర్చకులు శాస్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు కళ్యాణాన్ని తిలకించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, కార్యనిర్వహణ అధికారి సిరికొండ నవీన్, అర్చ కులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, బద రీనా రాయ ణచార్యులు, లక్ష్మీనర్సింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఈదురు గాలులు, వడగళ్ల వాన

**- ఈదురు గాలులతో వడగండ్ల వాన**
**- మండలంలో కొంతమేర పంట నష్టం**
**- ఆందోళన చెందుతున్న రైతులు**
**- నేలకొరిగి చెట్లు, విద్యుత్ స్తంభాలు**





చింతలపాలెం మే 6 ప్రభాతవార్త

మండలంలో మెరుపులు, ఉరుములతో ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వాన సోమవారం సాయ త్రం కొంత మేర భీభత్సం సృష్టించింది. దీంతో గ్రామాల్లో విద్యుత్ నిలిచి పోయింది. అక్కడక్కడ చెట్లు విరిగి పడటంతో రోడ్లపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నా ప్రజలకు ఈ వానకొంత మేర ఉపశమనం కలిగించింది. మండలపరిధిలోన రేబల్లె గ్రామంలో రైతులు బొప్పాయి తోటలు వేశారు. భారీగా ఈదురు గాలులు వీయడంతో చేతికొచ్చినతోటలు నేలపాలయ్యాయి. చేతికొచ్చిన పంట నేలకొరిగి పోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్క రైతుకు సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని, స ంబంధిత అధికారులు నష్టపోయిన పంటలను పరిశీలించి నష్టాన్ని ఉన్న తాధికారుల దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి తమ న్యాయం చేసి నష్ట పరిహారం చెల్లించాలని రైతులు కోరారు.

# శోభాయమానంగా రామయ్య కళ్యాణం

భద్రాచలంకల్చరల్, ప్రభాతవార్త :



భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి కళ్యాణం శోభాయమానంగా సాగింది. ఉదయమే పవిత్ర గోదావరి నదీ తీరం నుండి తీర్థపు బిందెలో మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు నడుమ నదీ జలాలను తీసుకుని శ్రీస్వామి వారి మూలవరులకు, ఉత్సవమూర్తులకు అభిషేక కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకీలో భక్తుల జయ జయ ధ్వానాల నడుమ శ్రీస్వామి వారి ఉత్సవమూర్తులను బేడా మండపానికి తీసుకుని వచ్చి ఆశీనులను చేశారు. అర్చకస్వాములు ముందుగా శ్రీస్వామి వారి సహస్ర నామార్చన, తదుపరి క్షేత్ర మహాత్యాన్ని భక్తులకు వివరించారు.



కళ్యాణతంతులో భాగంగా శ్రీస్వామి వారికి విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచన, శ్రీస్వామి వారి, అమ్మవార్ల ప్రవరలు, యోత్రధారణ, కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, మహాసంకల్పం, మంగళాష్టకాలు, చూర్ణిత, సుముహూర్తం, మాంగళ్యపూజ, మాంగళ్యధారణ, అక్షతారోపణ, వేదాశీర్వచనం, మంగళాశాసనంతో కళ్యాణతంతు ముగిసింది. కళ్యాణం జరుగుతున్నంత సేపు కళ్యాణంలో పాల్గొన్న దంపతులు కన్నులారా శ్రీసీతారామచంద్రస్వామి వార్లను చూస్తూ తరించిపోయారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలకు తన్మయత్వంతో పులకరించిపోయారు. అనంతరం కళ్యాణంలో పాల్గొన్న దంపతులకు దేవస్థాన సిబ్బంది కళ్యాణలడ్డూ, శ్రీస్వామి వారి వస్త్రాలు, అక్షతలు పంపిణీ చేశారు.

## -ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి

మణుగూరు, ప్రభాతవార్త, మే 6 ః

ప్రతి పోలింగ్ స్టేషన్‌లో అన్ని సౌకర్యాలు సమకూర్చేలా చర్యలు తీసుకోవాలని పినపాక ఏఆర్వో, భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ అన్నారు. ఆయన సోమవారం మణుగూరు జిల్లాపరిషత్ స్కూల్ ఆవరణలో స్ట్రాంగ్ రూంలో ఈవీఎంల కమీషనింగ్ చేసి భద్రపరిచిన అనంతరం పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలన్నారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా సంబంధిత పోలింగ్ స్టేషన్లలో బీఎల్‌వోలను సంప్రదించి సౌకర్యాలు ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఈ నెల 7, 8 తేదీల్లో మణుగూరు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోని ఐకేపీ భవన్ నందు ఏర్పాటు చేసిన ఓటర్ స్పెషాలిటీ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్‌ను ఎన్నికల్లో పాల్గొనే సిబ్బంది వినియోగించుకోవాలన్నారు. సెక్టార్ వారీగా ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌లో సంబంధిత బీఎల్‌వోను ఫోన్ ద్వారా సంప్రదించి ప్రతి పోలింగ్ స్టేషన్‌లో మంచినీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం ఈ నెల 9, 10 తేదీల్లో ప్రతి పోలింగ్ స్టేషన్ సందర్శి ంచాలని సెక్టోరియల్ అధికారి మొదలుకొని ఎలక్షన్ డ్యూటీ పడిన సిబ్బంది అందరూ స్థానికంగా ఉండాలన్నారు. ఈ నెల 11 తేదీ సాయంత్రం ఎలక్షన్ డ్యూటీ పడిన సిబ్బంది అందరూ పోలింగ్ సామాగ్రి చేరవేసేందుకు 59 బస్సులు ఏర్పాటు చేసినట్లు, పోలింగ్ విధుల్లో 1500 మంది సిబ్బంది ఉంటారన్నారు. అందరూ తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

## మిర్యాలగూడ వార్త

## యాసంగి దాన్యం కొనుగోలును వేగవంతంగా పూర్తి చేయాలి

ఖమ్మం, మే 6, ప్రభాతవార్త:

జిల్లాలో యాసంగి దాన్యం కొనుగోలును వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ తెలిపారు. సోమవారం నూతన కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అధికా రులతో దాన్య కొనుగోలుపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ధాన్య కొనుగోలుకు 236 కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. 78 కేంద్రాల్లో కొనుగోళ్లు జరిపినట్లు, ఇప్పటికి 11317.720 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు ఆయన అన్నారు. ఎక్కడ ఏ కేంద్రంలోనూ ధాన్యం నిల్వ ఉండకూడదని, ఎప్పటికప్పుడు రవాణా చేయాలని ఆయన అన్నారు. ఆకాల వర్షాల పట్ల అన్ని జాగ్రత్తలు చేపట్టాల న్నారు. ధాన్యం ఎక్కువగా వచ్చే కేంద్రాలకు ఎక్కువ లారీలు పంపాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఎంత ధాన్య ం ఉన్నది, కేంద్ర పరిధిలోని గ్రామాల్లో ఎంత మేర ధాన్య ం ఉన్నది నివేదిక సమర్పించాలన్నారు.1840 ట్యాబ్ నమో దులు చేసినట్లు తెలిపారు. పెండింగ్ ట్యాబ్ నమో దులు వెంటనే పూర్తి చేయాలన్నారు. రైస్ మిల్లుల తనిఖీ లు చేపట్టి, సిఎంఆర్ ఎంత, ఇతరాలు ఎంతమేర ఉన్నవి చూడాలన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి, ధాన్య కొనుగోళ్లను పరిశీలించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఏ దశలోనూ ఆలస్యం చేయకూడదని కొన్న ధాన్యాన్ని నమోదులు పూర్తి చేసి, వెంట వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని ఆయన తెలిపారు. ఓబిఎంఎస్ నమోదులు పూర్తి చేసి, రైతులకు ధాన్యం డబ్బులు అందేలా చర్యలు వేగవంతం చేయాలన్నారు. గత సంవత్స రంలో ఇదే సమయంలో ఎంత మేర సేకరించింది ఇప్పుడు ఎంత సేకరించింది పరిశీలన చేసి తగు చర్యలు తీసుకోవా లని ఆయన తెలిపారు. సమీక్షలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, జిల్లా వ్యవసాయ అధికా రిణి విజయనిర్మల, డిఆర్డీఓ సన్యాసయ్య, జిల్లా పౌరస రఫ రాల అధికారి చందన్‌కుమార్, జిల్లా పౌర సరఫ రాల మేనే జర్ శ్రీలత, జిల్లా రవాణా అధికారిణి ఆఫ్రీన్, జిల్లా ఉద్యా నవన అధికారి వెంకట రమణ, జిల్లా మార్కె టింగ్ అధికా రి ఎంఏ అలీమ్, అదనపు డిఆర్డీవో శిరీష పాల్గొన్నారు.

## కులధృవీకరణ, పోడుపట్టాలు మంజూరు చేయండి

**-మంత్రికు వినతిపత్రం సమర్పించిన చర్ల వాసులు**

చర్ల, ప్రభాతవార్త :



చర్ల మండలంలో గత 50 సంవత్సరాలుగా నివసిస్తున్న గిరిజన వలస ఆదివాసీలకు కులధృవీకరణ పత్రాలు 2018వ సంవత్సరం నుంచి నిలుపుదల చేయడం జరిగిందని, అట్టి కులధృవీకరణ పత్రాలు మరలా వలస గిరిజన, ఆదివాసీలకు మంజూరు చేయాలని, పోడు భూముల పట్టాలు మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చర్ల మండల వాసులు, కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్, చర్ల పీఏసీఎస్ చైర్మన్ పరుచూరి రవికుమార్, జడ్పీటీసీ ఇర్ప శాంత, కాంగ్రెస్ పార్టీ నాయకులు చీమలమర్రి మురళీకృష్ణ, దేవభక్తుని రామకృష్ణ, ఎస్సీసెల్ నాయకులు తోటమళ్ళ వరప్రసాద్‌లు పాల్గొన్నారు.